PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

CELEBRATING 1 Year ANNIVERSARY

ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మంగళవారం TUESDAY 30-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 1 Issue: 1

30 జూన్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి పాడ్యమి ఉ. 7:38o వరకు సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పూర్వాషాఢ ఉ. 6:43o వరకు యోగం బ్రహ్మ మ. 3:08 వరకు కరణం భాలవ సా. 6:32 వరకు కౌలవ ఉ. 7:38o వరకు వర్జ్యం మ. 2:46 నుండి సా. 4:33 వరకు దుర్ముహూర్తం ఉ. 8:25 నుండి ఉ. 9:17 వరకు రా. 11:14 నుండి రా. 11:57 వరకు రాహుకాలం మ. 3:35 నుండి సా. 5:12 వరకు యమగండం ఉ. 9:04 నుండి ఉ. 10:42 వరకు గుళికాకాలం మ. 12:19 నుండి మ. 1:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు రా. 1:28 నుండి తె. 3:15 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:45 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



# దేశీయ మార్కెట్లకు నష్టాలు

**నిఫ్టీ 24,000 దిగువకు.. మార్కెట్లపై పశ్చిమాసియా ప్రభావం**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీనికి తోడు ఆటో, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 372.10 పాయింట్లు నష్టపోయి 76,728.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109.75 పాయింట్లు క్షీణించి 23,946.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలతో ట్రేడర్లు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడారు. దీంతో దాదాపు అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. సాంకేతిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,000 కీలక నిరోధంగా మారింది. దీనిని దాటితే 24,100-24,200 స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక దిగువన 23,900 తక్షణ మద్దతుగా, 23,800 బలమైన మద్దతుగా పనిచేస్తుందని వారు తెలిపారు. ఈరోజు ట్రేడింగ్‌లో ఫార్మా, మెటల్, హెల్త్‌కేర్ రంగాలు రాణించగా.. ఆటో, కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు అత్యధికంగా నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ మిడ్‌క్యాప్ సూచీ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం మేర నష్టపోయాయి. రాబోయే రోజుల్లో పశ్చిమాసియా పరిణామాలు, ఇతర అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హర్మ్యూజ్.. భారత్ బంధు

**టోల్ లేకుండానే తీరం దాటిన 12 నౌకలు**

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని కుదిపేసిన ఇంధన సంక్షోభ సమయంలో పరిస్థితిని భారత్ సమర్థంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. హర్మ్యూజ్ జలసంధిని దాదాపు నాలుగు నెలలు మూసివేసినా దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టోల్ చెల్లించకుండానే 12కు పైగా ఎల్‌పీజీ నౌకలను హర్మ్యూజ్ నుంచి తరలించామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని పురీ పేర్కొన్నారు. ముడిచమురు దిగుమతులను ఒక్క దేశానికే పరిమితం చేయకుండా పలు దేశాల నుంచి తెప్పించామని చెప్పారు. దీంతో దేశంలో వంటగ్యాస్, ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు. సంక్షోభ సమయంలో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా భారీగా పెంచామని వివరించారు. ఇంతకుముందు వంటగ్యాస్ ఉత్పత్తి చేయని రిఫైనరీలను కొద్ది రోజుల్లోనే మార్పులు చేసి ఎల్‌పీజీ తయారీకి సిద్ధం చేశామని చెప్పారు. దీంతో రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తిని 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచగలిగామని తెలిపారు. వంటగ్యాస్ కొరత రాకుండా అల్జీరియా, జపాన్, కెనడా వంటి దేశాలతో కొత్త సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నామని పురీ చెప్పారు. అమెరికా నుంచి అదనపు ఎల్‌పీజీ కార్గోలను కూడా తెప్పించామని వెల్లడించారు. దీంతో దేశీయ అవసరాలను పూర్తిగా తీర్చగలిగామని అన్నారు. ఇంధన ధరల భారం తగ్గించేందుకు కేంద్రం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని గుర్తుచేశారు. అలాగే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు వంటగ్యాస్ పంపిణీలో డిజిటల్ అథెంటికేషన్ విధానాన్ని తప్పనిసరి చేశామని చెప్పారు. ఈ చర్యల వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభ ప్రభావం భారత వినియోగదారులపై పడకుండా కాపాడగలిగామని హర్దీప్ పేర్కొన్నారు.

# 60 రోజుల్లో విచారణ.. ఉరిశిక్ష

**65 ఏళ్ల కామాంధుడిపై కోర్టు కొరడా**

పుణే: సమాజం సిగ్గుతో తలదించుకునేలా జరిగిన ఓ దారుణమైన ఘటనలో పుణే కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి, అత్యంత పాశవికంగా హత్య చేసిన కేసులో 65 ఏళ్ల భీమ్‌రావు కాంబ్లే అనే వృద్ధుడికి మరణశిక్ష విధిస్తూ నేడు తీర్పు ఇచ్చింది. ఈ నేరాన్ని 'అరుదైన వాటిలో అత్యంత అరుదైనది'గా అభివర్ణించిన న్యాయస్థానం, నిందితుడి క్రూరత్వానికి ఎలాంటి క్షమాభిక్ష తగదని స్పష్టం చేసింది. పుణే జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.ఆర్. సాలుంఖే ఈ తీర్పును వెలువరించారు. కిడ్నాప్, అత్యాచారం, హత్య వంటి అభియోగాలపై కాంబ్లేను దోషిగా నిర్ధారించిన కొద్ది రోజులకే శిక్షను ఖరారు చేశారు. పుణే జిల్లాలోని నస్రాపూర్ గ్రామంలో మే 1వ తేదీన ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం, నిందితుడు భీమ్‌రావు కాంబ్లే.. చిన్నారికి తినుబండారాలు ఆశచూపి, కొత్తగా పుట్టిన దూడను చూపిస్తానని నమ్మించి తన వెంట తీసుకెళ్లాడు. అనంతరం సమీపంలోని పశువుల పాక దగ్గర ఉన్న ఓ షెడ్‌లోకి బాలికను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత చిన్నారి నోరు నొక్కి, ఛాతీపై గాయపరిచి కిరాతకంగా చంపేశాడు. ఈ దాడి సమయంలోనే బాలిక ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. పాప కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా, ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. వెతుకులాటలో బాలిక మృతదేహం లభించింది. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, కాంబ్లే పాపను తీసుకెళుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీని ఆధారంగా పోలీసులు అతడిని గుర్తించి అరెస్టు చేశారు.

# తమిళనాడులో 3 నెలల్లో ఎన్నికలు!

**డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు**



చెన్నై: తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని ఆరోపించారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచారంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.



# బంగారం అమ్మేస్తున్నారు!

## నగదుగా మార్చుకుంటున్న భారతీయులు.. ధరలు తగ్గుతాయని మధ్యతరగతిలో భయం

న్యూఢిల్లీ: భవిష్యత్తులో ధరలు పడిపోతాయనే(మార్కెట్ కరెక్షన్)భయంతో, తమ వద్ద ఉన్న పాత బంగారు ఆభరణాలను అమ్మి నగదుగా మార్చుకునేందుకు భారతీయులు.. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు ఎగబడుతున్నారు. దీంతో ఈ మూడునెలల్లో ఏకంగా 43 శాతం మేర పాత బంగారం అమ్మకాలు పెరిగిపోయాయి. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ అందించిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతీయ కుటుంబాలు ఏకంగా 50 టన్నుల పాత బంగారాన్ని విక్రయించాయి. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 43శాతం ఎక్కువ. ఈ వినూత్న ధోరణి కారణంగా దేశంలో పాత బంగారం రీసైక్లింగ్ పరిశ్రమకు ఒక్కసారిగా భారీ డిమాండ్ పెరిగింది. ఇళ్లల్లో లేదా బ్యాంక్ లాకర్లలో ఊరికే పడి ఉండే పాత ఆభరణాలు ఇప్పుడు ఫార్మల్ ఎకానమీ (అధికారిక మార్కెట్)లోకి వస్తున్నాయి. ప్రముఖ ముత్తూట్ ఎగ్జిమ్ సంస్థ తమ 100కు పైగా 'గోల్డ్ పాయింట్' నెట్‌వర్క్‌లలో పాత బంగారం వాల్యూమ్ ఏకంగా 40 శాతం పెరిగినట్లు ప్రకటించింది. వినియోగదారులు ఇప్పుడు పాత పద్ధతుల్లో కాకుండా, పారదర్శకమైన అధికారిక ఛానెల్స్ ద్వారా బంగారాన్ని నగదుగా మార్చుకునేందుకు ఇష్టపడుతున్నారని ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కేయూర్ షా తెలిపారు. గతేడాది 2025లో రీసైకిల్డ్ గోల్డ్ వాటా 125-150 టన్నులుగా ఉంది. ఇదే ట్రెండ్ కొనసాగితే ఈ ఏడాది అది 200-250 టన్నులకు చేరవచ్చని చెబుతున్నారు. భారతీయ కుటుంబాల వద్ద సుమారు 30,000 టన్నుల బంగారం నిల్వలు ఉన్నట్లు అంచనా. ఈ విధంగా అంతర్గతంగానే రీసైక్లింగ్ పెరగడం వల్ల దేశానికి పసిడి దిగుమతుల భారం తగ్గి, విదేశీ మారక ద్రవ్యం ఆదా అయ్యే అవకాశం ఉంటుందని కూడా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా, బంగారం ధరలు ఈ ఏడాది ప్రారంభంలో సరికొత్త రికార్డులను సృష్టించాయి. అయితే ప్రస్తుతం ఎంసీఎక్స్ మార్కెట్లో బంగారం ధర సగటున తులం (10 గ్రాములు) రూ. 1,44,199 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది ఆల్‌టైమ్ హై కంటే తక్కువగా ఉండటంతో, భవిష్యత్తులో ధరలు మరింత తగ్గి రూ. 1.2 లక్షల మార్కుకు పడిపోవచ్చనే అంచనాలు మార్కెట్లో వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చేతిలో ఉన్న బంగారానికి మంచి విలువ ఉన్నప్పుడే లాభం చేసుకోవాలని వినియోగదారులు భావించడం కూడా దీనికి ముఖ్య కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నారు.

# రేపటి నుంచి పెట్రోల్ బండ్ల రిజిస్ట్రేషన్ బంద్

**'ఈవీ పాలసీ 2026'కు ఢిల్లీ కేబినెట్ ఆమోదం**

**ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు**



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "ఢిల్లీ ఈవీ పాలసీ 2026"కు తమ కేబినెట్ ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా సోమవారం ప్రకటించారు. ఈ కొత్త విధానం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చి, 2030 మార్చి 31 వరకు కొనసాగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ పాలసీ ద్వారా రాబోయే నాలుగేళ్లలో పౌరులకు సుమారు రూ. 15,000 కోట్ల ప్రయోజనాలు చేకూరుతాయని సీఎం వివరించారు. ఇందులో భాగంగా, ప్రభుత్వం నేరుగా రూ. 7,000 కోట్లను ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయనుంది. మరో రూ. 8,000 కోట్లను పన్ను మినహాయింపులు, ప్రోత్సాహకాల రూపంలో ఈవీ వినియోగదారులకు అందిస్తుంది. లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు ఆమోదం తర్వాత ఈ పాలసీ అధికారికంగా అమల్లోకి వస్తుంది. ఈ కొత్త పాలసీలో భాగంగా, 2027 జనవరి 1వ తేదీ నుంచి ఢిల్లీలో కొత్త పెట్రోల్ లేదా సీఎన్‌జీ ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా నిషేధిస్తారు. ఆ తర్వాత కేవలం ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే అనుమతి ఉంటుంది. అదేవిధంగా, 2028 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెట్రోల్, సీఎన్‌జీ టూవీలర్ల రిజిస్ట్రేషన్లను కూడా నిలిపివేయనున్నారు. కొత్త విధానం ప్రకారం, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేవారికి 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. కార్ల విషయానికొస్తే, రూ. 30 లక్షల లోపు ఎక్స్-షోరూమ్ ధర ఉన్న వాహనాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, కార్లు, తేలికపాటి గూడ్స్ ట్రక్కులు, గ్రామీణ సేవా వాహనాలతో సహా అన్ని రకాల వాహనాలకు ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాధారణ వాహనాలకు, ఎలక్ట్రిక్ వాహనాలకు మధ్య ధర వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ రాయితీలు రూపొందించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. "కాలుష్య రహిత, స్వచ్ఛమైన రవాణా రాజధానిగా ఢిల్లీని మార్చడమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం" అని ఆమె పేర్కొన్నారు. వాహనాల కొనుగోలును ప్రోత్సహించడమే కాకుండా, పాత వాహనాల తుక్కు (స్క్రాపింగ్), ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ఈ పాలసీ దృష్టి సారిస్తుందని ఆమె వివరించారు. ఈ పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన కేబినెట్ మంత్రులు పంకజ్ కుమార్ సింగ్, ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సాలను సీఎం అభినందించారు.

# అమర్‌నాథ్‌లో శాస్త్రోక్తంగా తొలి పూజ



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక శ్రీ అమర్‌నాథ్ జీ యాత్ర-2026 లాంఛనంగా ప్రారంభమైంది. సోమవారం పవిత్ర గుహాలయంలో 'ప్రథమ పూజ'ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ కార్యక్రమంలో పాల్గొని, యాత్ర సన్నాహాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మంచులింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా 'ఎక్స్' వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "హర హర మహాదేవ్! శ్రీ అమర్‌నాథ్ జీ పవిత్ర గుహలో ప్రథమ పూజ నిర్వహించడం నిజంగా నా అదృష్టం. ఇది వార్షిక యాత్రకు లాంఛనమైన ప్రారంభం. బాబా బర్ఫానీ ఆశీస్సులతో ప్రజలందరూ శాంతి, శ్రేయస్సు, సంపూర్ణ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభమై, ఆగస్టు 28న శ్రావణ పౌర్ణమి, రక్షా బంధన్ పండుగలతో ముగుస్తుంది. మొత్తం 57 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. యాత్రను సురక్షితంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మనోజ్ సిన్హా తెలిపారు. "యంత్రాంగం, పుణ్యక్షేత్రాల బోర్డు, సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా దళాలు, స్థానిక ప్రజలు, సేవా ప్రదాతలు, వాలంటీర్లు అందరూ పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించడానికి సర్వం సిద్ధం చేశాం" అని ఆయన భరోసా ఇచ్చారు. భారీగా మెరుగుపరిచిన మౌలిక సదుపాయాలు, అదనపు సౌకర్యాలతో యాత్రికులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. అనంతనాగ్ జిల్లాలోని కశ్మీర్ హిమాలయాల్లో, సముద్ర మట్టానికి 3,880 అడుగుల ఎత్తులో ఈ పవిత్ర గుహ ఉంది. ఇక్కడి మంచుతో సహజసిద్ధంగా ఏర్పడే శివలింగాన్ని భక్తులు శివుని దివ్య శక్తులకు ప్రతీకగా భావిస్తారు. యాత్రికులు ప్రధానంగా రెండు మార్గాల ద్వారా గుహకు చేరుకుంటారు. సంప్రదాయ పహల్గామ్ మార్గంలో ప్రయాణానికి నాలుగు రోజులు పడుతుంది. అయితే, బల్తాల్ బేస్ క్యాంప్ నుంచి వెళ్లే యాత్రికులు దర్శనం చేసుకుని అదే రోజు తిరిగి రావచ్చు. ఈ ఏడాది యాత్రలో ఒక ముఖ్యమైన మార్పు చోటుచేసుకుంది. బేస్ క్యాంపులైన పహల్గామ్, బల్తాల్ నుంచి పవిత్ర గుహకు వెళ్లే మార్గాన్ని 'నో-ఫ్లై జోన్'గా అధికారులు ప్రకటించారు. ఈ కారణంగా, ఈ యాత్రలో భక్తులకు హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. యాత్రికులు ఈ మార్పును గమనించి, అందుకు అనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# పెట్రోల్, డీజిల్ పై ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు పెద్ద ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ రిటైల్ అమ్మకాలపై విధించిన తాత్కాలిక ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. జులై 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నట్లు సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో పారిశ్రామిక, సంస్థాగత, రవాణా రంగాలకు చెందిన సంస్థలు ఎలాంటి పరిమితులు లేకుండా నేరుగా రిటైల్ బంకుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు మార్గం సుగమమైంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా హర్మ్యూజ్ జలసంధి మీదుగా ఇంధన సరఫరాలకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలతో, ఈ ఏడాది జూన్ 12న కేంద్రం ముందుజాగ్రత్త చర్యగా ఈ ఆంక్షలను విధించింది. దీనికి తోడు, బల్క్, రిటైల్ డీజిల్ ధరల మధ్య లీటర్‌కు సుమారు రూ.40 వ్యత్యాసం ఉండటంతో అనేక వాణిజ్య సంస్థలు రిటైల్ బంకుల వైపు మళ్లాయి. ఈ నేపథ్యంలో ఇంధన సరఫరాను కాపాడేందుకు వాణిజ్య సంస్థలు బంకుల నుంచి నేరుగా ఇంధనం కొనడాన్ని నిషేధించడంతో పాటు, డీజిల్ కొనుగోళ్లపై రోజుకు 200 లీటర్ల పరిమితి విధించారు. ప్రస్తుతం ఇంధన సరఫరాలు క్రమంగా స్థిరపడుతుండటంతో ప్రభుత్వం ఆంక్షలను దశలవారీగా సడలిస్తోంది. ఇటీవలే హోటళ్లు, రెస్టారెంట్లకు వాణిజ్య ఎల్పీజీ సరఫరాను కూడా సాధారణ స్థితికి పునరుద్ధరించింది. అయితే, ఇప్పటికే పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ)కి మారిన వినియోగదారులను తిరిగి ఎల్పీజీ వాడకానికి అనుమతించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# భారత్‌లో రూ.4 లక్షల కోట్ల ఫేక్ దందా

**రహస్య ఏజెంట్లను నియమిస్తున్న కంపెనీలు**

**ఫేక్ సరుకును గుర్తించేందుకు నియామకాలు**

న్యూఢిల్లీ: అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్లు భారత్‌లో భారీగా విస్తరించిన నకిలీ వస్తువుల మార్కెట్‌పై ఉక్కుపాదం మోపుతున్నాయి. వెర్సాచీ, మైఖేల్ కోర్స్, జిమ్మీ చూ వంటి ప్రఖ్యాత కంపెనీలు నకిలీ సరుకును అరికట్టేందుకు రహస్య ఇన్వెస్టిగేటర్లను నియమించుకుంటున్నాయి. వీరు సాధారణ కస్టమర్ల రూపంలో మార్కెట్లలోకి వెళ్లి, నకిలీ వస్తువులను విక్రయించే వారి సమాచారాన్ని సేకరించి కంపెనీలకు అందిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా సదరు బ్రాండ్లు పోలీసుల సాయంతో దాడులు నిర్వహించి, నకిలీ సరుకును స్వాధీనం చేసుకుని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాయి. గతనెలలో వెర్సాచీ కంపెనీకి ఓ ఇన్వెస్టిగేటర్ ఇచ్చిన సమాచారంతో తూర్పు ఢిల్లీలోని ఓ బల్క్ సెల్లర్‌పై పోలీసులు దాడి చేశారు. నగరంలోని పలు దుకాణాలకు నెలనెలా లక్షల రూపాయల విలువైన నకిలీ సరుకును సరఫరా చేస్తున్న అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, స్టాక్‌ను సీజ్ చేశారు. భారత్‌లో అసలైన లగ్జరీ మార్కెట్ విలువ 6 నుంచి 8 బిలియన్ డాలర్లు కాగా, 2028 నాటికి ఇది 12 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అయితే, దీనికి భిన్నంగా నకిలీ దుస్తులు, యాక్సెసరీల మార్కెట్ విలువ సుమారు రూ. 4 లక్షల కోట్లు ఉంటుందని 2024 ఫిక్కీ నివేదిక పేర్కొంది. రోడ్ల పక్కన అమ్మకాల నుంచి ఆన్‌లైన్ వేదికల ద్వారా వ్యవస్థీకృత నెట్‌వర్క్‌గా ఈ దందా విస్తరించింది. బ్రాండ్లు తీసుకుంటున్న ఈ చర్యలను న్యాయ నిపుణులు స్వాగతిస్తున్నారు. ఈ సమస్య తీవ్రతకు, సంప్రదాయ పద్ధతుల్లోని పరిమితులకు ఇది అద్దం పడుతోందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి రహస్య ఆపరేషన్ల ద్వారానే బలమైన ఆధారాలు సేకరించి కోర్టులో కేసులు నిలబడేలా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంపై స్పందించేందుకు వెర్సాచీ, మైఖేల్ కోర్స్ వంటి కంపెనీలు నిరాకరించాయి.

# చంపత్ రాయ్‌కు వీహెచ్‌పీ మద్దతు

అయోధ్య: అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అలోక్ కుమార్ గట్టిగా మద్దతు పలికారు. అంతేకాదు, రాయ్ రాజీనామాను డిమాండ్ చేసిన రాజకీయ నాయకులపై ఆయన తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాలు, వెండి ఇటుకలు వంటి విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తడంతో, నైతిక బాధ్యత వహిస్తూ చంపత్ రాయ్ ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయంపై సోమవారం మాట్లాడిన అలోక్ కుమార్, ఈ వ్యవహారంలో పారదర్శకమైన, నిష్పాక్షికమైన విచారణకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ట్రస్ట్ తీసుకున్న చర్యలే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "ఈ ఆరోపణలు వెలుగులోకి రాగానే ట్రస్ట్ వెంటనే ప్రాథమిక విచారణ జరిపి, దోషులను గుర్తించి, రూ. 80 లక్షలు రికవరీ చేసింది. ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదిక ఆధారంగా 8 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది" అని అలోక్ కుమార్ వివరించారు. విచారణకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే చంపత్ పాటు మరో ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా కూడా స్వచ్ఛందంగా తమ పదవుల నుంచి తప్పుకున్నారని ఆయన వెల్లడించారు.

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

CELEBRATING 1 Year ANNIVERSARY

ప్రథమ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మంగళవారం TUESDAY 30-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 1 Issue: 1

30 జూన్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి పాడ్యమి ఉ. 7:38ం వరకు సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పూర్వాషాఢ ఉ. 6:43ం వరకు యోగం బ్రహ్మ మ. 3:08 వరకు కరణం భాలవ సా. 6:32 వరకు కౌలవ ఉ. 7:38ం వరకు వర్జ్యం మ. 2:46 నుండి సా. 4:33 వరకు దుర్ముహూర్తం ఉ. 8:25 నుండి ఉ. 9:17 వరకు రా. 11:14 నుండి రా. 11:57 వరకు రాహుకాలం మ. 3:35 నుండి సా. 5:12 వరకు యమగండం ఉ. 9:04 నుండి ఉ. 10:42 వరకు గుళికాకాలం మ. 12:19 నుండి మ. 1:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు రా. 1:28 నుండి తె. 3:15 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:45 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# నిరుద్యోగ రణం

## పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ముట్టడి యత్నం.. 20 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

## కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం.. నిరుద్యోగులను లాగేసిన పోలీసులు

పోలీస్ రిక్రూట్‌మెంట్ విషయంలో నిరుద్యోగులు మరోసారి రోడెక్కారు. సోమవారం డీజీపీ కార్యాలయం ముట్టడికి తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ప్రయత్నించింది. ఎస్ఐ, కానిస్టేబుళ్ల నియామకాల కోసం ఐదు నెలల్లో నోటిఫికేషన్ విడుదల చేయాలని అలాగే పోలీస్ ఉద్యోగాల్లో పోస్టుల సంఖ్య 5000 నుంచి 20,000 పెంచాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపు ఇచ్చింది.



హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): నిరుద్యోగుల పిలుపు మేరకు డీజీపీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు లక్డీకపూల్ ప్రాంతంలోని డీజీపీ కార్యాలయం పరిసరాల్లోనే అడ్డుకున్నారు. నిరసనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, పోలీస్ ఉద్యోగాల పోస్టుల సంఖ్యను 5 వేల నుంచి 20 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆందోళన ఉధృతం కావడంతో రంగంలోకి దిగిన పోలీసులు - 2 వ పేజీలో...



# మూలుగుతున్న రూ.9,000 కోట్లు

## బీమా కంపెనీల వద్ద భారీగా క్లెయిమ్ చేయని డబ్బు

## 25 ఏళ్ల వరకు క్లెయిమ్ చేసుకునే అవకాశం

బీమా పాలసీదారులకు, వారి కుటుంబ సభ్యులకు చెందిన దాదాపు రూ.9,000 కోట్ల రూపాయలు లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల వద్ద క్లెయిమ్ చేయకుండా పేరుకుపోయాయి. చాలా సందర్భాల్లో నామినీలకు పాలసీ ఉన్న విషయమే తెలియకపోవడం, పత్రాలు పోగొట్టుకోవడం లేదా పాలసీదారులు తమ వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వంటి కారణాలతో ఈ భారీ మొత్తం ఎవరికీ చెందకుండా మిగిలిపోయింది.

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన వివరాల ప్రకారం, 2026 ఫిబ్రవరి 28 నాటికి రూ. 8,973.89 కోట్ల క్లెయిమ్ చేయని నిధులు బీమా సంస్థల వద్ద ఉన్నాయి. నిబంధనల ప్రకారం, పాలసీ డబ్బు చెల్లించాల్సిన గడువు ముగిసిన 12 నెలల వరకు ఎవరూ క్లెయిమ్ చేయకపోతే దానిని 'అన్‌క్లెయిమ్డ్' మొత్తంగా పరిగణిస్తారు. పదేళ్ల తర్వాత ఈ డబ్బును ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ చేసినప్పటికీ, పాలసీదారులు లేదా వారి వారసులు 25 ఏళ్ల వరకు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యులకు -2 వ పేజీలో...

# ఉద్యోగులకు 2,000 కోట్లు రిలీజ్

## సర్కారీ సార్లకు డబుల్ బొనాంజా

### జీపీఎఫ్ బకాయిలు 100 శాతం క్లియర్.. రూ. 10 వేలలోపు ఉన్న దాదాపు 5 లక్షల టోకెన్లకు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి కాంగ్రెస్ ప్రభుత్వం అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పింది. గత ప్రభుత్వాల హయాంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తున్న రేవంత్ సర్కార్.. తాజాగా సోమవారం మరో రూ. 2 వేల కోట్లను విడుదల చేసింది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ నిధులను అధికారికంగా రిలీజ్ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. ఇందులో భాగంగానే గత నెల 29న మొదటి విడతలో రూ. 2 వేల కోట్లను విడుదల తరువాయి 2 వ పేజీలో...



# కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూ శర్మ

## 12 మంది ఐపీఎస్‌ల బదిలీ

### పలువురికి అదనపు బాధ్యతలు

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జీవో జారీ చేసింది. రాష్ట్ర పోలీసు విభాగంలో పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పేర్కొన్నారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా సీహెచ్ సింధూ శర్మను నియమించారు. మల్టీజోన్ 1 ఐజీగా రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూకు అదనపు బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డీ జోయెల్ డేవిస్ యాదాద్రి జోన్ డీఐజీగా అదనపు బాధ్యతలు ఇచ్చింది. వరంగల్ సీపీ సుప్రీత్ సింగ్‌ను బదిలీ చేసి.. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా నియమించింది. రాజన్న జోన్ సన్‌ప్రీత్ సింగ్ అదనపు -2 వ పేజీలో...



## రాశి ఫలాలు



30.6.2026

మేషం: స్థిరాస్తి వివాదాలు చికాకు కలిగిస్తాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు తప్పవు. వృత్తి ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నూతన ఋణాలు చేస్తారు. చేపట్టిన పనులలో ఎంత కష్టించినా ఫలితం కనిపించదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి.

వృషభం: ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. గృహమున వివాహది శుభకార్యములు జరుగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. ఉద్యోగాలలో పనిభారం నుండి ఉపశమనం లభిస్తుంది.

మిధునం: ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. విలువైన వస్తువులు సేకరిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు నుండి బయటపడతారు. చేపట్టిన పనుల్లో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

కర్కాటకం: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.

సింహం: చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు తప్పవు. అనారోగ్య సమస్యలు వలన వ్యాపారములు కొంత మందగిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఋణదాతల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. బంధు మిత్రులతో అకారణ మాటపట్టింపులు కలుగుతాయి.

కన్య: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు ఉన్నపటికీ అంచనాలు అందుకుంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. నూతన పనులు ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

తుల: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. స్థిరాస్తి క్రయ విక్రయలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల నుంచి ఆకస్మిక ధనలాభాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు.

వృశ్చికం: ఇంటా బయట బాధ్యతలు చికాకు పరుస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. ముఖ్యమైన పనులు శ్రమతో కానీ పూర్తికావు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఋణ ఒత్తిడి వలన మానసిక సమస్యలు పెరుగుతాయి. వ్యాపార ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

ధనస్సు: వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. దూరపు బంధువులు నుండి అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు పరుస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

మకరం: రాజకీయ వర్గం వారి నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి ధనలాభ సూచనలున్నవి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట బాధ్యతల నుండి కొంత ఉపశమనం పొందుతారు.

కుంభం: ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వ్యయప్రయాసలతో కానీ కొన్ని పనులు పూర్తికావు. బంధు మిత్రులతో మీ మాటతో విభేదిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు తప్పవు.

మీనం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగ ప్రయత్నలలో అవరోధాలు తొలగుతాయి. నూతన కార్యక్రమాలు కార్యరూపం దాలుస్తాయి. సమాజంలో పెద్దల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. ధన పరంగా ఆశించిన పురోగతి పొందుతారు.

# డబుల్ ఇంజిన్‌తోనే తెలంగాణ అభివృద్ధి

## నిర్ణయాత్మక నాయకత్వంతోనే దేశం అభివృద్ధి.. బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ వెల్లడి

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, 'డబుల్ ఇంజిన్ సర్కార్' వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు మారుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నేడు ఘట్‌కేసర్ సమీపంలో జరిగిన 'వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ.. "ప్రస్తుత యువతరం దేశ వ్యతిరేక ఆలోచనలతో కాకుండా, దేశ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోంది. కొందరు క్రీడల్లో, మరికొందరు స్టార్టప్‌లతో తమ భవిష్యత్తును, దేశ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. దేశంలో 2.25 లక్షల మంది యువత స్టార్టప్‌ల ద్వారా ఉద్యోగ సృష్టికర్తలుగా మారారు" అని అన్నారు. దేశ రాజ్యాంగాన్ని, సంస్కృతిని ప్రశ్నించేవారు నిజమైన యువతరం కాదని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే దేశంలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లు, 125కు పైగా యునికార్న్‌లు ఆవిర్భవించాయని తెలిపారు. "నేటి యువత ఉద్యోగాలు సృష్టించే వారిగా మారుతున్నారు. వారి ఆవిష్కరణలు, సామర్థ్యాలు దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి" అని వివరించారు. యువత రాజకీయాల్లోకి రావాలని, స్పష్టమైన లక్ష్యంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై నితిన్ నబిన్ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర యువతకు ఉపాధి, అభివృద్ధి వంటి కీలక హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ, నైపుణ్యం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిర్ణయాత్మక నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆయన బీహార్ అనుభవాన్ని పంచుకున్నారు. "2005లో బీహార్‌లో మా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటికే చాలాకాలంగా ఉన్న డీజీపీనే కొనసాగించారు. అయితే, నాయకత్వం మారడంతో అదే డీజీపీ ఒకటిన్నర సంవత్సరాల్లో బీహార్‌లో శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చారు. దీన్నిబట్టి సమర్థవంతమైన నాయకత్వం ఉంటే వ్యవస్థ ఎంతలా మారుతుందో అర్థం చేసుకోవచ్చు" అని ఉదహరించారు. సోషల్ మీడియా వాడకం పెరగడంతో ప్రజల్లో చైతన్యం పెరిగిందని, నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తుంచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ తగ్గినా భయపడను

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

గద్వాల, జూన్ 29 (ఈవార్తలు): సెక్యూరిటీ తగ్గించి మరో పాలమూరు బిడ్డను ఇబ్బంది పెట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సెక్యూరిటీ తగ్గించినా, గన్‌మెన్లను తొలగించినా, నన్ను చంపేందుకు కుట్ర పన్నినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గద్వాలలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నా గుండుపైన, హరీష్ రావు ఎత్తుపైనా మాట్లాడినట్టు తాను మాట్లాడి సంస్కారహీనుణ్ని కాదలుచుకోలేనని వెల్లడించారు. నడిగడ్డ సస్యశ్యామలం కావాలని కేసీఆర్ గట్టు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తే పట్టించుకోవడం లేదని, ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన లేదని విమర్శించారు. పెండింగ్ పనుల విషయంలో పార్టీ మారిన ఎమ్మెల్యే గద్వాల నియోజకవ ర్గానికి ఎన్నికోట్లు తీసుకొచ్చాడో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో జరిగిన సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని బయటపెట్టి ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి నలుగురు కర్ణాటకలో ఏమి మాట్లాడారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నడిగడ్డలోని నెట్టెంపాడు ర్యాలంపాడు తుమ్మిళ్ల పనులు పూర్తి చేయకుండా పనులు పడావు పెట్టారని విమర్శించారు. దమ్ముంటే నడిగడ్డలో వున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్ర వాళ్లకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఎంపీ మల్లురవి ఢిల్లీకి మూటలు మోయడం తప్పా నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు చేసిందేమి లేదన్నారు. ఇక్కడి ప్రాజెక్టులు పూర్తి చేయించాలనే ఆలోచన ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డికి లేదని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ రెగ్యులరైజ్ ఎవరైతే చేస్తున్నారో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా వెంటనే చంచల్ గూడ జైల్లో వారి కోసం సపరేట్ బ్యారక్ కట్టిస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ కేసులో దొరికిన నిరంజన్ జైన్ కు ట్రంక్ పెట్టెలు టెండర్ ఇచ్చారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో గద్వాల బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాస్ హనుమంత నాయుడు, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో రేవంత్ మధిర సభ రద్దు

**సభను హైదరాబాద్‌కు మార్చిన ప్రభుత్వం**

**శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'**

**మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం**

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రభుత్వ కార్యక్రమాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'ను చివరి నిమిషంలో రద్దు చేశారు. వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధిర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభను రద్దు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సభను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నారు.

## 'వీబీ జీ రామ్ జీ'పై కేంద్రానికి అభ్యంతరాలు

**జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో సీతక్క**

న్యూఢిల్లీ: వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## 15 మంది ఐఎఫ్ఎస్‌లకు స్థానం చలనం

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): అటవీశాఖలో 15 మంది ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ గా పనిచేసిన వీఎస్ఎన్వీ.ప్రసాద్ ను పీసీసీఎఫ్ ఆఫీస్ లో చీఫ్ కన్జర్వేటర్ (ప్లానింగ్ అండ్ విజిలెన్స్)గా నియమించారు. ఆదిలాబాద్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్డీఓ)గా చిన్నా విశ్వనాథ్ భూసారెడ్డికి ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ /తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేస్తున్న జీబీ.రేఖ భానుకు ఫారెస్ట్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ గా ప్రమోషన్ ఇచ్చారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ / పీసీపీఎఫ ఆఫీస్ లో విజిలెన్స్-2 డీఎఫ్ఓగా ఎస్.రాజశేఖర్ ను నల్గొండ జిల్లా డీఎఫ్ఓగా బదిలీ చేశారు. డిప్యూటీ కన్జర్వేటర్‌గా ఉన్న ముకుంద్ రెడ్డికి ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ గా ప్రమోషన్ కల్పించారు. పీసీసీఎఫ్ ఆఫీస్ లో డిప్యూటీ కన్జర్వేటర్(అడ్మిన్)గా పనిచేస్తున్న సంహితకు డిప్యూటీ కన్జర్వేటర్ గా ప్రమోషన్ కల్పించడంతోపాటు పీసీసీఎఫ్ ఆఫీసులోనే పోస్టింగ్ ఇచ్చారు. దీంతోపాటు తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ గా నరసింహారెడ్డికి ప్రమోషన్ ఇవ్వడంతోపాటు అక్కడే కొనసాగించాలని నిర్ణయించారు.

## 2 లక్షలు లంచం తీసుకుంటూ చిక్కిన ఏఈ

అశ్వరావుపేట, జూన్ 29 (ఈవార్తలు): నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న లట్చుబుక్త శ్రీనివాస రావు అవినీతి నిరోధక అధికారులకు దొరికాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట సబ్ డివిజన్-1 నీటిపారుదల శాఖలో ఏఈగా ఉన్న శ్రీనివాస రావు సోమవారం రైతు నుంచి రూ.2లక్షల లంచం తీసుకుంటూ పట్టుపడ్డాడు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు అతడిని ఏసీబీ బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. తమ వ్యవసాయ భూమి పక్కనే ఉన్న దొంతికుంట ట్యాంక్ నుంచి మట్టి తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని బాధితుడు ఏఈ శ్రీనివాసరావును కోరాడు. అందుకు అతడు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దాంతో, సదరు వ్యక్తి అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదుతో మాటు వేసిన ఏసీబీ అధికారులు సోమవారం శ్రీనివాసరావు రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి వరంగల్ జడ్జి ముందు హాజరుపరిచారు.

# నిరుద్యోగ రణం

మొదటి పేజీ తరువాయి

నిరుద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. కొందరిని బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లో ఎక్కించి సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల చర్యలతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి కొద్దిసేపు ఆందోళనకరంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. నిరుద్యోగులతో పాటు పలువురు జేఏసీ నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

### జాబ్ క్యాలెండర్ సంగతేంది?

అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్ట లేదు. గద్దెనెక్కిన రెండున్నరేళ్ల తర్వాత కూడా 5 వేల పోలీస్ ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణం. 20 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి.ఐ- ఓ నిరుద్యోగి

# కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూ శర్మ

మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు ఇచ్చింది ప్రభుత్వం. హైదరాబాద్ నార్త్ జోన్ లా అండ్ ఆర్డర్ జాయింట్ కమిషనర్ ఎం శ్వేతను వరంగల్ పోలీస్‌గా కమిషనర్‌గా నియమించారు. ఆమెకు జోన్-6 డీఐజీగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. అలాగే, సీఐ సెల్ ఇంటెలిజెన్స్ డీఐజీ ఆర్ భాస్కరన్‌కు బాసర జోన్ అదనపు బాధ్యతలను కేటాయించింది. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్ఎం విజయ్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ నార్త్ రేంజ్ లా అండ్ ఆర్డర్ జాయింట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చింది. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ జై శేఖర్‌ను బదిలీ చేసి సీఐ సెల్ ఇంటెలిజెన్స్ ఎస్పీగా నియమించారు. ఎస్ఐబీ ఎస్పీ అదనపు బాధ్యతల నుంచి తప్పించారు. ఎస్ సాయి శేఖర్‌కు రైల్వే పోలీస్ సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్ఎంఈఐటీ డిప్యూటీ కమిషనర్ చెరుకూరి రూపేశ్‌ను సీఐడీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ చేశారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌ను కూడా సీఐడీ ఎస్పీగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్ వెంకటేశ్వర్లును హైదరాబాద్ కార్ హెడ్క్వార్టర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా నియమించింది. ప్రభుత్వం ఇంతకుముందు ఇచ్చిన సీఐడీ ఎస్పీ పోస్టింగ్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేశ్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### 36 మంది డీఎస్పీల బదిలీ

అటు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 36 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ, పోస్టింగ్‌లు ఇస్తూ.. డీజీపీ సీవీ ఆనంద్ ఆర్డర్స్ ఇచ్చారు. అయితే ఇందులో కొన్ని రోజులుగా పోస్టింగ్స్ కోసం ఎదురుచూస్తున్న డీఎస్పీలే అధికంగా ఉండటం గమనార్హం. పోస్టింగ్స్ కోసం వెయిటింగ్‌లో 28 మంది సివిల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు (పీఈబీ) చేసిన సిఫార్సులతో డీజీపీ సీవీ ఆనంద్.. సోమవారం.. ఈ డీఎస్పీల బదిలీలకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను విడుదల చేశారు. ఖాళీగా ఉన్న స్థానాల్లో పోస్టింగులు కల్పించేందుకు వెంటనే ఈ ఉత్తర్వులు అమలు చేయాలని ఆదేశించారు.

# ఉద్యోగులకు 2,000 కోట్లు రిలీజ్

మొదటి పేజీ తరువాయి

చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనక్కి తగ్గకుండా, ఇప్పుడు రెండో విడత కింద మరో రూ. 2 వేల కోట్లను విడుదల చేసి ఉద్యోగుల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది. ఈ దఫా నిధుల విడుదలలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ తాజా చెల్లింపుల ద్వారా కింది బకాయిలన్నీ క్లియర్ అయ్యాయి. రిటైర్డ్ ఉద్యోగులతో పాటు జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు 100 శాతం జమయ్యాయి. ప్రస్తుతం వీరి అకౌంట్లలో ఎలాంటి జీపీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో లేవు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి సెప్టెంబర్ 2025 వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించేసింది. బకాయిల చెల్లింపుల్లో చిన్న మొత్తాలకు సర్కార్ సమాన ప్రాధాన్యం ఇచ్చింది. ట్రెజరీలో రూ.10,000 లోపు విలువ కలిగిన చిన్న బిల్లులన్నింటినీ ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించింది. ఈ కేటగిరీలో ఏకంగా 5 లక్షలకు పైగా టోకెన్లను గుర్తించి వెంటనే అమౌంట్ సెటిల్ చేసింది. మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే క్రమపద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ అధికారులు భరోసా ఇవ్వడంతో.. ఉద్యోగులు, పెన్షనర్లలో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మూలుగుతున్న రూ.9,000 కోట్లు

మొదటి పేజీ తరువాయి

పాలసీ ఉందనే విషయం తెలియకపోవడమే దీనికి అతిపెద్ద కారణంగా నిపుణులు చెబుతున్నారు. ఇటీవల ఢిల్లీకి చెందిన ఓ మహిళ, తన తండ్రి మరణించిన కొన్ని నెలల తర్వాత ఆయన ఇన్సూరెన్స్ పాలసీ గురించి ఒక ఈమెయిల్ ద్వారా తెలుసుకున్నారు. ఆ తర్వాత అసలు పత్రాలను గుర్తించి, దాదాపు రూ.4 లక్షల మెచ్యూరిటీ మొత్తాన్ని పొందగలిగారు. ఇలాంటి ఘటనలు సర్వసాధారణమని నిపుణులు అంటున్నారు. కవర్‌ష్యూర్ వ్యవస్థాపకుడు సౌరభ్ విజయ్‌వర్గియా ప్రకారం, ఎండోమెంట్, మనీ-బ్యాక్ వంటి సంప్రదాయ పాలసీలు 15 నుంచి 30 ఏళ్ల పాటు కొనసాగుతాయి. ఈ సుదీర్ఘ కాలంలో పాలసీదారులు చిరునామా, ఫోన్ నంబర్, నామినీ వివరాలను మార్చడం మర్చిపోతారు. ఇదే అన్‌క్లెయిమ్డ్ మొత్తాలు పెరగడానికి కారణమవుతోంది. క్లెయిమ్ చేయని నిధుల్లో ఎక్కువ భాగం లైఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించినదే. ఇందులో మెచ్యూరిటీ డబ్బు, డెత్ క్లెయిమ్స్, సరెండర్ విలువలు, సర్వైవల్ బెనిఫిట్స్ వంటివి ఉన్నాయి. ఇక హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ విషయానికి వస్తే, అసంపూర్తిగా ఉన్న రీయింబర్స్‌మెంట్లు, ప్రీమియం రిఫండ్‌లు, పూర్తికాని క్లెయిమ్ ప్రాసెస్‌ల వల్ల డబ్బు మిగిలిపోతోంది.




# డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్ గెలుపు!

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపణలు**

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (ఖుశ్రీఖుఎబత్శ్రీఖు ఖుజఔష్ఖు) వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్ వేదికగా కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొడంగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని వచ్చాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

# తెలంగాణ బియ్యానికి గ్లోబల్ డిమాండ్

**హైదరాబాద్‌లో కేసీపీ న్యూట్రీ మల్టీ విటమిన్ రైస్.. లాంచ్ చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): వానకాలం, యాసంగి అని తేడా లేకుండా తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి రికార్డులు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణను గ్లోబల్ రైస్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తోంది. బియ్యం ఎగుమతులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు పరిశ్రమలకు స్పెషల్ ఇన్సెంటివ్స్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో కేసీపీ న్యూట్రీ సంస్థకు చెందిన మల్టీ విటమిన్ రైస్‌ను ఆయన లాంచ్ చేశారు. కేవలం ఎఫ్‌సీఐ కొనుగోళ్లకే పరిమితం కాకుండా.. రైతులు, మిల్లర్లు ప్రపంచ మార్కెట్‌ను టార్గెట్ చేయాలని మంత్రి సూచించారు. దేశీయంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ బియ్యానికి భారీ డిమాండ్ ఉందన్నారు. నాణ్యమైన బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసే ఇండస్ట్రీలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని.. అవసరమైన పర్మిషన్లను సైతం ఫాస్ట్ ట్రాక్‌లో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సాధారణ బియ్యానికి బదులుగా ఫోర్టిఫైడ్ రైస్, మల్టీ విటమిన్ రైస్ వంటి వాటిని ఉత్పత్తి చేయాలని



మిల్లర్లకు మంత్రి పిలుపునిచ్చారు. ఇలా బియ్యానికి వాల్యూ యాడ్ చేయడం వల్ల ప్రజల ఆరోగ్యానికి మేలు జరగడమే కాకుండా.. ఇంటర్నేషనల్ మార్కెట్లో మంచి ఆదరణ దక్కుతుందన్నారు. దీనివల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు మిల్లర్లకు రెట్టింపు లాభాలు వస్తాయని వివరించారు. తెలంగాణ వ్యవసాయ సత్తా ఏంటో దేశానికి అర్థమైందని మంత్రి అన్నారు. ఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే ఏకంగా 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. ఇందుకు సంబంధించిన రూ. 19,303 కోట్లను ఎలాంటి జాప్యం లేకుండా రైతుల బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ చేశామన్నారు. భౌగోళికంగా పెద్ద రాష్ట్రమైన ఏపీలో కేవలం 25 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు జరిగిందంటే.. తెలంగాణ ప్రభుత్వ రైతు అనుకూల విధానాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల విస్తరణ, వ్యవసాయ విప్లవం వల్లే ఈ అద్భుతమైన రిజల్ట్స్ వస్తున్నాయని ఉత్తమ్ చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వానాకాలం, యాసంగి కలిపి వార్షిక బియ్యం ఉత్పత్తి 300 లక్షల టన్నులు దాటిందని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రజల అవసరాలకు కేవలం 36 లక్షల టన్నులు మాత్రమే సరిపోతాయన్నారు. మిగిలిన బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎక్స్‌పోర్ట్ చేయడం ద్వారా తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకువస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రేవంత్‌ది హిట్లర్ పాలన

**నిరుద్యోగులపై పోలీస్ చర్య ఖండనీయం**

**మాజీమంత్రి హరీశ్ రావు**

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వద్ద న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. ఆందోళన చేస్తున్న వారిని ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడం సీఎం రేవంత్ రెడ్డి పాలన తీరును ప్రతిబింబిస్తోందన్నారు. నిరుద్యోగులపై జరిగిన పోలీసు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతను అరెస్టు చేయడం



నియంతృత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు నిరుద్యోగులను అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఖరి హిట్లర్ పాలనను తలపిస్తోందని హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారిపై చర్యలు తీసుకోవడం దారుణమని అన్నారు. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, డీజీపీ స్వయంగా ప్రకటించిన 20 వేల పోలీస్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల ఆకాంక్షలను అణచివేయడం కాకుండా, ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# హరీశ్‌కు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది!

**ప్రజలిచ్చిన అధికారాన్ని కాలరాస్తమా?**

**కాళ్లు లేని వాడిలా బీఆర్ఎస్ సవాళ్లు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎద్దేవా**

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి మాట్లాడారు. దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై ఈ సందర్భంగా ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రజానీకం తమకు ఐదేళ్లకు అధికారమిచ్చారని గుర్తు చేశారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉందని స్పష్టం చేశారు. గత రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసని పొంగులేటి అన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముందని ప్రశ్నించారు. రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా అని సవాలు విసిరినట్లే బీఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో అటు కేటీఆర్ సైతం ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారన్నారు. తన నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతానని నొక్కిచెప్పారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదని మంత్రి క్లారిటీ ఇచ్చారు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే అని మంత్రి వివరించారు. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదన్నారు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో రాదని మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు. మరోవైపు అధికారంలోకి వస్తామని బీజేపీ పగటికలలు కంటోందని పొంగులేటి విమర్శించారు. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని మంత్రి ఆరోపించారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదన్నారు.



# పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స!

**ముంబై కోకిలాబెన్ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు**

**వెంటనే సర్జరీ చేయాలన్న డాక్టర్లు.. కార్యక్రమాలు పూర్తయ్యాకేనన్న పవన్**

ముంబై: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఆయన చేతి కండరాలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే సర్జరీ చేయాలని సూచించారు. అయితే, రాష్ట్రానికి సంబంధించిన అధికారిక కార్యక్రమాలు, పరిపాలనా విధులు పూర్తయిన తర్వాతే తాను శస్త్రచికిత్స చేయించుకుంటానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సోమవారం నాడు తన భార్య అన్నా లెజినోవాతో కలిసి పవన్ ముంబై వెళ్లిన సంగతి తెలిసిందే. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. ఆయన రెండు భుజాలను క్షుణ్ణంగా పరీక్షించిన వైద్య బృందం, రొటేటర్ కఫ్‌తో పాటు చేతికి సంబంధించిన రెండు కండరాలకు తీవ్ర గాయమైనట్టు గుర్తించింది. గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నందున, తక్షణమే శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమమని వైద్యులు సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయనకు పూర్తి నివేదికను అందజేశారు. అయితే, వైద్యుల సూచనపై స్పందించిన పవన్ కల్యాణ్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. ముందుగా నిర్దేశించుకున్న ప్రభుత్వ కార్యక్రమాలను, పరిపాలనా బాధ్యతలను పూర్తి చేయడం తన కర్తవ్యమని ఆయన భావించారు. ఈ కార్యక్రమాలన్నీ ముగిసిన తర్వాతే శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరతానని తెలిపారు. ఈ మేరకు అధికారిక కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా, పవన్ కల్యాణ్ గత కొంతకాలంగా చేతి నొప్పితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. రెండు చేతుల కండరాలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు, రొటేటర్ కఫ్ గాయంతో ఆయన అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నొప్పి ఆయన్ను వేధించింది.

## ఏపీ మీదుగా బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే

**బేతమంగళ-బైరెడ్డిపల్లె మధ్య 25 కిలోమీటర్ల మార్గం ప్రారంభం**

**హోస్కోటె నుంచి బైరెడ్డిపల్లె వరకు కారుకు టోల్ ఫీజు రూ.195**

విజయవాడ, జూన్ 29 (ఈవార్తలు): బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో తొలి దశలో భాగంగా బేతమంగళ నుంచి బైరెడ్డిపల్లె వరకు 25 కిలోమీటర్ల మేర కొత్త మార్గాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రాకపోకలకు అందుబాటులోకి తెచ్చింది. జూన్ 25 నుంచి ఈ మార్గంలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణ దూరం దాదాపు 100 కిలోమీటర్లకు చేరింది. ఇప్పటికే కర్ణాటకలోని హోస్కోటె నుంచి బేతమంగళ వరకు 71 కిలోమీటర్ల మార్గం వినియోగంలో ఉండగా, తాజా విస్తరణతో బైరెడ్డిపల్లె వరకు నిరంతరాయంగా ప్రయాణించే వీలు కలిగింది. ఎన్ హెచ్‌ఏఐ విడుదల చేసిన టోల్ నోటిఫికేషన్ ప్రకారం, హోస్కోటె నుంచి బైరెడ్డిపల్లె వరకు ప్రయాణించే కార్లు, జీపులు, వ్యాన్‌లకు ఒకవైపు ప్రయాణానికి టోల్ ఛార్జీగా రూ.195 నిర్ణయించారు. మొత్తం 262 కిలోమీటర్ల పొడవైన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పూర్తయితే బెంగళూరు–చెన్నై మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న ఆరు గంటల నుంచి కేవలం మూడు గంటలకు తగ్గనుంది. ఈ ప్రాజెక్టు కర్ణాటక (72 కి.మీ.), ఆంధ్రప్రదేశ్ (85 కి.మీ.), తమిళనాడు (106 కి.మీ.) రాష్ట్రాల గుండా వెళ్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 85 కిలోమీటర్ల పనులను మూడు ప్యాకేజీలుగా విభజించగా, వాటిలో రెండు దాదాపు పూర్తయినట్టు ఎన్ హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు. అటవీ అనుమతుల కారణంగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా వేగవంతం చేస్తున్నారు. కొత్తగా ప్రారంభమైన బైరెడ్డిపల్లె టోల్ ప్లాజా వద్ద అప్పుడే రోజుకు సగటున రూ.2.2 లక్షల ఆదాయం వస్తోంది. మొత్తం ప్రాజెక్టును 2026 డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## సాయికృష్ణ కేసులో హెడ్ కానిస్టేబుళ్లు లొంగుబాటు

విజయవాడ, జూన్ 29 (ఈవార్తలు): విజయవాడ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, జంగం నాని సోమవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఘటన జరిగిన నాటి నుంచి పరారీలో ఉన్న వీరిద్దరూ ఇవాళ అనూహ్యంగా ప్రత్యక్షమయ్యారు. వారు కృష్ణలంక పీఎస్ లో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, విజయవాడ సౌత్ జోన్ ఏసీపీ కార్యాలయానికి అశోక్, జంగం నాని ఓ ఆటోలో వచ్చారు. అనంతరం నేరుగా అధికారుల ఎదుట లొంగిపోయారు. ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజును సిట్ అధికారులు అరెస్ట్ చేయగానే... నాని, అశోక్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సాయికృష్ణ మృతి ఘటనలో వీరిపై కేసులు నమోదు కాగా, అప్పటి నుంచి పోలీసులు వీరి కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఈ కేసులోని ఇతర అంశాలపై దర్యాప్తును ముమ్మరం చేశారు. వారిద్దరూ ఈ కేసులో సీఐ నాగరాజుకు సహకరించినట్టు సిట్ గుర్తించింది.

## సీఐ నాగరాజు కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడ, జూన్ 29 (ఈవార్తలు): విజయవాడ రౌడీషీటర్ గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో సీఐ నాగరాజును కస్టడీకి అప్పగించాలని కోరుతూ సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. విజయవాడలోని ఏజేఎమ్ కోర్టులో ఈరోజు ఈ కేసుకు సంబంధించి రెండు పిటిషన్లపై విచారణ జరిగింది. నాగరాజును 12 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టుకు విన్నవించుకున్నారు. ఆయన నుంచి మరిన్ని కీలక వివరాలు సేకరించాలని వారు కోరారు. వాదనలు విన్న కోర్టు సీఐ తరఫున కౌంటర్ దాఖలు చేయాలని ఆయన తరపు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను జులై 1వ తేదీకి వాయిదా వేసింది. గాదె సాయికృష్ణ మృతి కేసు ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ బాబురావును కూడా సిట్ అధికారులు ఈరోజు అరెస్ట్ చేశారు.

## గిరిజనుల కోసమే పవన్ 'పంచాయతీ': నాగబాబు

మంగళగిరి, జూన్ 29 (ఈవార్తలు): ఏపీలో పార్టీ బలోపేతంపై జనసేన పూర్తి స్థాయిలో దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా జనసేన పార్టీ రాబోయే ఎన్నికల నేపథ్యంలో సరికొత్త వ్యూహాలతో ముందుకు వెళుతోంది. అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నట్లు జనసేన అగ్రనేత, ఎమ్మెల్సీ నాగబాబు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ జనసేన అభ్యర్థులను నిలబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నాగబాబు తెలిపారు. గిరిజన హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖను తీసుకున్నారని చెప్పారు. కురుడి, డుంబ్రిగూడ, బల్లగరువు, పోతంగి, అనంతగిరి, పాడేరు, అరకు, పెద్దబాడు వంటి గిరిజన ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ స్వయంగా పర్యటించి సమస్యలు అర్థం చేసుకున్నారని చెప్పారు. 'అడవితల్లి బాట' కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాలకు రూ.1,005 కోట్లతో సుమారు 1,069 కిలోమీటర్ల రోడ్లు నిర్మించారని తెలిపారు. పీఎం జన్మన్ నిధుల నుంచి రూ.555 కోట్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2,525 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.50 కోట్లు కేటాయించి గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బాక్సైట్ మైనింగ్, హైడ్రో ప్రాజెక్టుల విషయంలో పర్యావరణం, గిరిజనుల జీవన విధానానికి ఎలాంటి హాని కలగకుండా చూస్తామని స్పష్టం చేశారు.







# ఐ అండ్ పీఆర్ ఎదుట డెస్క్ జర్నలిస్టుల ధర్నా

**అక్రెడిటేషన్ల జారీలో అన్యాయాన్ని సరిదిద్దాలి**

**గతంలో అక్రెడిటేషన్లు పొంది, పదేండ్ల అనుభవం గల వారికి కార్డులు ఇవ్వాలి**

**మండల విలేకరుల కార్డుల జారీకి సీఏ సర్టిఫికెట్ల లింకు అసంబద్ధం**

**పెండింగ్ కార్డులను జారీని తక్షణం పూర్తి చేయాలని డిమాండ్**



డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ల జారీలో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని డెస్క్ జర్నలిస్టుల సంఘం(డీజేఎస్) డిమాండ్ చేసింది. 10–12 ఏండ్లకుపైగా సీనియారిటీ ఉన్న వారికి కూడా కార్డులు రావడం లేదని, అసంబద్ధమైన కారణాలను చూపుతూ అక్రెడిటేషన్లు నిరాకరరించడ సరికాదని విమర్శించింది. ఈ మేరకు డీజేఎస్ ఆధ్వర్యంలో డెస్క్ జర్నలిస్టులు సోమవారం ఉదయం 11 గంటలకు ఐ అండ్ పీఆర్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీజేఎస్ అధ్యక్షుడు బాదిని ఉపేందర్ మాట్లాడుతూ పాత కార్డులపై కొనసాగుతన్న బస్‌పాస్‌ల గడువు ఈ నెల 30తో ముగుస్తున్నందున.. తక్షణం కొత్త అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆలస్యం చేస్తే చాలా మంది జర్నలిస్టులు బస్‌పాస్ సౌకర్యం కోల్పోయి ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. గత రెండు, మూడు దఫాలుగా అక్రెడిటేషన్లు పొందిన, పదేండ్లకుపైగా అనుభవం ఉన్న ప్రతి డెస్క్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు రాకపోవడం బాధకరమని.. వారందరికి వెంటనే కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే మహిళా జర్నలిస్టులు లేని చోట, ఆ కోటా కార్డులు అదే సంస్థలో పని చేస్తున్న అర్హులైన మిగతా జర్నలిస్టులకు ఇవ్వాలన్నారు. తెలంగాణలో దివ్యాంగులైన వర్కింగ్ జర్నలిస్టులు అతి తక్కువ సంఖ్యలో ఉన్నారని.. మేనేజ్‌మెంట్ల కోటాతో సంబంధం లేకుండా వారందరికి కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లో అప్లికేషన్లను వెంటనే అప్రూవ్ చేసి తక్షణం కార్డులు అందజేయాలన్నారు. మండల స్థాయి విలేకరులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చే విషయంలో మండలంలోని సర్క్యులేషన్‌పై సీఏ సర్టిఫికెట్ కోరడం పూర్తిగా అసంబద్ధమన్నారు. పత్రికలు తమ మొత్తం సర్క్యులేషన్‌పై కేంద్ర ప్రభుత్వం గుర్తింపు కలిగిన ఏబీసీ, పీఆర్‌జీఐ సర్టిఫికెట్లు సమర్పించాక కూడా మళ్లీ సీఏ సర్టిఫికెట్ అడగడం మండల విలేకరులకు అక్రెడిటేషన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడమే తప్ప మరొకటి కాదన్నారు. ఐ అండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు గతంలో హామీ ఇచ్చినట్టుగా ఎక్కువ జనాభా కలిగిన మండలాల్లో మండల స్థాయి విలేకరులకు ఒకటి కంటే ఎక్కువ కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం ఐ అండ్ పీఆర్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో.. డిమాండ్లతో కూడిన మెమొరాండంను ఐ అండ్ పీఆర్ అడిషనల్ డైరెక్టర్ జగన్ కు సమర్పించారు. దీనిపై ఆయన స్పందిస్తూ మెమొరాండంలో పేర్కొన్న సమస్యలను కమిషనర్, మీడియా అకాడమీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్ర్యమంలో డీజేఎస్ ప్రధాన కార్యదర్శి కేఎన్ రాజారామ్, ట్రెజరర్ వి.వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ కనపర్తి రమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి,పద్మ, సంఘం ప్రతినిధులు సిలివేరు వెంకటేశం, చల్లా సైదిరెడ్డి, రమేశ్, అశోక్, రమేశ్ , తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచన**



కోరుట్ల, జూన్ 29 (ఈవార్తలు): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), పార్టీ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి, పైడిమడుగు గ్రామాల్లో బీఎల్ఏలు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారం అందించి సహకరించాలని బీఎల్ఏలకు తెలిపారు. బూత్ స్థాయి కార్యకర్తలు ప్రతి ఇంటికి చేరుకుని ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కు పరిరక్షించడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని, ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పాల్గొని సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం



బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి

జగిత్యాల, జూన్ 29 (ఈవార్తలు): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో అర్హుల ఓట్లు తొలగిపోకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఎస్ఐఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా లేదా అనే అంశాన్ని మాత్రమే పరిశీలించేవారని, ప్రస్తుతం 2002ను ప్రాతిపదికగా తీసుకోవడంతో ప్రజల్లో గందరగోళం నెలకొందన్నారు. 2002లో ఓటు లేని వారి తల్లిదండ్రుల వివరాలను పరిశీలించే అవకాశం ఉండటంతో, ముఖ్యంగా వివాహిత మహిళల తల్లిదండ్రుల ఓట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. ఉపాధి కోసం పట్టణాలకు వలస వచ్చి స్థిరపడిన వారి ఓట్లు తొలగే ప్రమాదం ఉందని, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను చైతన్యపరచాలని కోరారు. పార్టీ బలోపేతంతోనే భవిష్యత్ ముడిపడి ఉందని, రానున్న శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో పది జిల్లాలను 33 జిల్లాలుగా విభజించడంతో పాటు ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని, బీసీ, మైనారిటీ గురుకులాల ద్వారా బలహీన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు గుప్పించిన జీవన్ రెడ్డి.. 30 నెలల కాలంలో కొత్తగా ఒక్క పాఠశాల కూడా ప్రారంభించలేదని ఆరోపించారు. యంగ్ ఇండియా పాఠశాలలు పేరుకే పరిమితమయ్యాయని అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే కేంద్రీయ విద్యాలయానికి స్థలం గుర్తించలేకపోతున్నారని, పదేళ్లు బీఆర్ఎస్‌లో అధికారాన్ని అనుభవించి పదవి కోసం కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. ప్రస్తుతం జగిత్యాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులన్నీ కేటీఆర్ మంజూరు చేసిన నిధులతోనే జరుగుతున్నాయని, స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా ఎమ్మెల్యే బినామీలకు పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు పార్టీకి సేవలందించిన జీవన్ రెడ్డికి కాంగ్రెస్ మానసిక వేదన మిగిల్చిందన్నారు. బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరడాన్ని ఆమె తప్పుబట్టారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావా వసంత సురేష్, పట్టణ అధ్యక్షుడు ఆయిల్నేని వెంకటేశ్వర్ రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ కోసం రోడ్డెక్కిన రైతులు

**వెదిరలో ఉద్రిక్తత.. విద్యుత్ సరఫరా నిలిపివేతపై ఆందోళన**

చొప్పదండి, జూన్ 29 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు, గ్రామస్థులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ధర్నా విరమించబోమని వారు తేల్చిచెప్పారు. రైతుల ఆందోళనతో ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులు సహా వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు గంటపాటు కొనసాగిన ధర్నాతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.






## భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య

**జగిత్యాల జిల్లా నూకపల్లిలో దారుణం**

మల్యాల, జూన్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి గ్రామంలో సోమవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. గోలెపు నాగరాజు (35) తన భార్య లక్ష్మి (30)ని ఉరివేసి హత్య చేసిన అనంతరం తాను కూడా ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న మల్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నప్పటికీ, పూర్తి వివరాలు దర్యాప్తులో తేలనున్నాయి. సీఐ మాదాసు రాజ్‌కుమార్, ఎస్ఐలు ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామ నిర్వహించారు. హత్య, బలవన్మరణ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

గొల్లపల్లి, జూన్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో జీవనంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన అనవేని లక్ష్మణ్ (55) ధర్మారం ఎమ్మార్వో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతూ జగిత్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనారోగ్యం కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురై జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో 28 జూన్ రాత్రి సుమారు 11 గంటల సమయంలో తన నివాసం వెనుక ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు అనవేని సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

# డబ్బున్న వాడిదే రాజ్యం!



**సమాజ పరిణామ క్రమాన్ని పరిశీలించినప్పుడు ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. మానవ నాగరికతలో అధికార స్వరూపం కాలానుగుణంగా మారుతూ వచ్చింది. ఒకప్పుడు శారీరక బలం అధికారానికి ప్రతీకగా ఉండేది. ఆ తర్వాత భూస్వామ్యం రాజ్యాధికారానికి ఆధారంగా నిలిచింది. పారిశ్రామిక విప్లవం తర్వాత మూలధనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించడం ప్రారంభించింది. నేడు డిజిటల్ యుగంలో సమాచారం, సాంకేతికత, పెట్టుబడులు, అంతర్జాతీయ ఆర్థిక శక్తులు ప్రపంచ రాజకీయాలను సైతం ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిణామాలన్నింటినీ ఒకే వాక్యంలో వ్యక్తపరిచే సామెత "డబ్బున్న వాడిదే రాజ్యం." ఇది కేవలం ఒక సామెత మాత్రమే కాదు; ఆధునిక సమాజంలోని అనేక వాస్తవాలను ప్రశ్నించే సామాజిక వ్యాఖ్య, రాజకీయ పరిశీలన, ఆర్థిక విశ్లేషణగా కూడా చూడవచ్చు. డబ్బు మానవ జీవితంలో అత్యంత అవసరమైన సాధనం. ఆహారం, విద్య, వైద్యం, నివాసం, ఉపాధి, రవాణా, సమాచార సాంకేతికత, వినోదం, భద్రత వంటి ప్రతి అవసరానికీ డబ్బు కీలక పాత్ర పోషిస్తోంది. వ్యక్తి నుంచి కుటుంబం వరకు, కుటుంబం నుంచి సమాజం వరకు, సమాజం నుంచి దేశం వరకు, దేశం నుంచి ప్రపంచం వరకు ప్రతి వ్యవస్థ ఆర్థిక కార్యకలాపాలపైనే ఆధారపడి నడుస్తోంది. అందువల్ల డబ్బు అవసరం అనే విషయాన్ని ఎవరూ ఖండించలేరు. కానీ డబ్బు అవసరం అనే సత్యం, డబ్బే అంతిమ శక్తి అనే భావనగా మారినప్పుడు అనేక సామాజిక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. అక్కడే "డబ్బున్న వాడిదే రాజ్యం" అనే భావన చర్చకు వస్తుంది.**



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

ప్రజాస్వామ్య వ్యవస్థలో సిద్ధాంతపరంగా ప్రతి పౌరుడు సమానుడు. ప్రతి ఓటుకు ఒకే విలువ ఉంటుంది. ప్రతి వ్యక్తికి చట్టం ముందు సమాన హక్కులు ఉంటాయి. కానీ వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే ఆర్థిక శక్తి కలిగిన వ్యక్తులు రాజకీయాల్లో, వ్యాపార రంగంలో, మీడియాలో, న్యాయపోరాటాల్లో, విద్యా అవకాశాల్లో, సామాజిక ప్రభావంలో ఎక్కువ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయాలు తరచూ వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారాల నుంచి ప్రభుత్వ విధానాల వరకు, కార్పొరేట్ పెట్టుబడుల నుంచి సామాజిక మాధ్యమాల వరకు, ఆర్థిక శక్తి ప్రభావం పెరుగుతోందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందుకే ఈ సామెత ఇప్పటికీ ప్రాసంగికతను కోల్పోలేదు. ప్రపంచీకరణ యుగంలో సంపదకు సరిహద్దులు లేవు. ఒక దేశంలో సంపాదించిన మూలధనం మరో దేశంలో పెట్టుబడిగా మారుతోంది. బహుళజాతి సంస్థలు అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వల్ల సంపద సృష్టి వేగం పెరిగింది. అదే సమయంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందనే ఆందోళనలు కూడా పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంపన్నుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, పేదరికం, నిరుద్యోగం, ఆదాయ అసమానతలు పూర్తిగా తగ్గలేదనే వాస్తవం మన ముందుంది. ఈ విరుద్ధ పరిస్థితుల మధ్య ధనం కేవలం ఆర్థిక సాధనమేనా, లేక సామాజిక అధికారానికి కొత్త రూపమా అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది.

భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశాల్లో ఈ చర్చ మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందిన భారతదేశంలో ప్రతి ఎన్నిక కోట్లాది ఓటర్ల నిర్ణయంతో జరుగుతుంది. అయినప్పటికీ ఎన్నికల వ్యయం సంవత్సరానికొకసారి పెరుగుతోంది. రాజకీయ ప్రచారం, మీడియా నిర్వహణ, డిజిటల్ ప్రకటనలు, భారీ సభలు, సంస్థాగత వ్యవస్థల నిర్వహణకు అపారమైన నిధులు అవసరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సాధారణ పౌరుడికి రాజకీయాల్లో సమాన అవకాశాలు ఉన్నాయా అనే ప్రశ్న తరచూ చర్చకు వస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులని రాజ్యాంగం చెప్పినా, రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరుగుతోందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. సమాజంలో గౌరవం కూడా అనేక సందర్భాల్లో సంపదతో ముడిపడుతోంది. ఒక వ్యక్తి విద్య, వ్యక్తిత్వం, సేవాభావం, నిజాయితీ కంటే అతని ఆర్థిక స్థాయిని చూసే ధోరణి కొన్నిచోట్ల పెరుగుతోంది. విలాసవంతమైన జీవనశైలి విజయానికి ప్రతీకగా ప్రచారం అవుతోంది. సామాజిక మాధ్యమాల ప్రభావంతో సంపద ప్రదర్శన ఒక కొత్త సంస్కృతిగా మారుతోంది. ఫలితంగా యువతలో కూడా సంపదను వేగంగా సంపాదించాలనే ఆకాంక్ష పెరుగుతోంది. ఇది సానుకూలంగా శ్రమకు ప్రేరణనిచ్చే సందర్భాలు ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో అనైతిక మార్గాలవైపు నడిపించే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే ఈ సామెతను మరో కోణంలో కూడా విశ్లేషించాలి. డబ్బున్న ప్రతి వ్యక్తి సమాజానికి హానికరుడు కాదు. నిజాయితీతో సంపాదించిన సంపద దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది. పరిశ్రమలు స్థాపించడం, ఉపాధి కల్పించడం, పన్నులు చెల్లించడం, శాస్త్రీయ పరిశోధనలకు మద్దతు ఇవ్వడం, విద్యాసంస్థలు, ఆసుపత్రులు నిర్మించడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం వంటి ఎన్నో రంగాల్లో సంపన్నులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కాబట్టి సమస్య డబ్బు ఉనికిలో లేదు; డబ్బు ఆధిపత్యంలో ఉంది. సంపద సమాజానికి సేవ చేసే సాధనంగా ఉంటే అది అభివృద్ధికి దోహదం చేస్తుంది. అదే సంపద ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని, సమాన అవకాశాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటే అది ఆందోళనకు కారణమవుతుంది.

ఆధునిక ప్రపంచంలో అధికారానికి అనేక రూపాలు ఉన్నాయి. రాజకీయ అధికారం, ఆర్థిక అధికారం, సాంకేతిక అధికారం, సమాచార అధికారం, మీడియా అధికారం, డిజిటల్ అధికారం పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. ఈ శక్తులన్నింటికీ మూలంగా ఆర్థిక వనరులు నిలుస్తున్నాయి. అందువల్ల ధనం కేవలం వ్యక్తిగత అవసరాలను తీర్చే సాధనం మాత్రమే కాదు; విధానాలను ప్రభావితం చేసే శక్తిగా కూడా మారగలదు. ఈ నేపథ్యంలో "డబ్బున్న వాడిదే రాజ్యం" అనే సామెత సామాజిక విమర్శగా మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ఆలోచింపజేసే హెచ్చరికగా కూడా నిలుస్తుంది. ఈ పరిశోధనాత్మక వ్యాసంలో చారిత్రక నేపథ్యం నుంచి ఆధునిక ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వరకు, రాజకీయాల నుంచి కార్పొరేట్ శక్తుల వరకు, ఎన్నికల నుంచి మీడియా వరకు, విద్య నుంచి న్యాయవ్యవస్థ వరకు, కుటుంబ విలువల నుంచి యువత ఆలోచనా విధానం వరకు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నుంచి కృత్రిమ మేధస్సు యుగం వరకు డబ్బు ప్రభావాన్ని సమగ్రంగా విశ్లేషించబోతున్నాం. అదే సమయంలో డబ్బు సమాజ నిర్మాణానికి ఎలా ఉపయోగపడగలదు, దాని దుష్ప్రభావాలను ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎలా నియంత్రించగలవు, నైతిక విలువలు, పారదర్శక పాలన, సమాన అవకాశాలు, బాధ్యతాయుత ఆర్థిక విధానాలు ఎందుకు అవసరమో కూడా లోతుగా పరిశీలించబోతున్నాం. ఎందుకంటే చివరికి ప్రశ్న డబ్బు గురించి కాదు; డబ్బు చేతుల్లో సమాజ భవిష్యత్తు ఎంతవరకు ఉండాలి అనే అంశం గురించి. అదే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

"డబ్బున్న వాడిదే రాజ్యం" అనే భావన నేటి సమాజంలో మాత్రమే పుట్టినది కాదు. మానవ నాగరికత చరిత్రను లోతుగా పరిశీలిస్తే అధికారానికి, సంపదకు మధ్య ఉన్న సంబంధం వేల సంవత్సరాల క్రితమే ఏర్పడిందని తెలుస్తుంది. అయితే కాలానుగుణంగా ఆ సంబంధం రూపాలు మారాయి. ఒకప్పుడు భూమిని నియంత్రించినవాడు రాజుగా ఉండేవాడు. తర్వాత వాణిజ్యాన్ని నియంత్రించినవాడు ప్రభావవంతుడిగా ఎదిగాడు. పారిశ్రామిక యుగంలో కర్మాగారాలను కలిగి ఉన్నవారు సమాజాన్ని ప్రభావితం చేశారు. నేడు పెట్టుబడులు, బ్యాంకింగ్ వ్యవస్థలు, సాంకేతిక సంస్థలు, డిజిటల్ వేదికలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిర్దేశిస్తున్నాయి. రూపాలు మారినా అధికారానికి సంపద పునాదిగా ఉండే పరిస్థితి మాత్రం కొనసాగుతోంది. ప్రాచీన నాగరికతలను పరిశీలిస్తే ఈజిప్ట్, మెసపొటేమియా, చైనా, భారతదేశం, రోమ్ వంటి ప్రాంతాల్లో భూమి ప్రధాన సంపదగా ఉండేది. వ్యవసాయ ఉత్పత్తులపై నియంత్రణ కలిగిన రాజులు, సామంతులు సమాజాన్ని పాలించేవారు. భూమిని కలిగి ఉండటం అంటే ఆర్థిక శక్తిని కలిగి ఉండటమే. ఆర్థిక శక్తి అంటే రాజకీయ అధికారాన్ని నియంత్రించడం. అందువల్ల భూస్వామ్యం, పాలనా వ్యవస్థ పరస్పరం ముడిపడి ఉండేవి. సామాన్య ప్రజలు వ్యవసాయం చేసేవారు. రాజులు పన్నులు వసూలు చేసేవారు. ఈ విధంగా సంపద అధికారానికి మూలాధారంగా మారింది. భారతదేశ చరిత్రలో కూడా అనేక రాజవంశాలు సంపద ఆధారంగానే తమ సామ్రాజ్యాలను విస్తరించాయి. మౌర్యులు, గుప్తులు, కాకతీయులు, విజయనగర రాజులు, మొఘలులు వంటి శక్తివంతమైన రాజ్యాల వెనుక బలమైన ఆర్థిక వ్యవస్థ ఉండేది. వ్యవసాయ పన్నులు, వాణిజ్య ఆదాయం, ఖనిజ సంపద, నౌకాశ్రయాలు రాజ్య సంపదకు ప్రధాన వనరులు. ఆర్థికంగా బలమైన రాజ్యాలు సైన్యాలను నిర్వహించగలిగాయి. కొత్త ప్రాంతాలను జయించగలిగాయి. కళలను, సాహిత్యాన్ని, నిర్మాణాలను ప్రోత్సహించగలిగాయి. అంటే ఆర్థిక బలం రాజకీయ శక్తిగా మారిన మొదటి రూపాలు చరిత్రలో అప్పుడే కనిపించాయి.

17వ శతాబ్దం నుంచి 19వ శతాబ్దం వరకు జరిగిన పారిశ్రామిక విప్లవం ప్రపంచ చరిత్రలో అతిపెద్ద ఆర్థిక మార్పుకు దారితీసింది. కర్మాగారాలు, యంత్రాలు, రైల్వేలు, గనులు, నౌకాయాన రంగం వేగంగా అభివృద్ధి చెందాయి. ఈ కాలంలో కొత్త వర్గం ఆవిర్భవించింది. వారు రాజులు కాదు. వారు భూస్వాములు మాత్రమే కాదు. వారు పారిశ్రామికవేత్తలు. ఉత్పత్తి సాధనాలను నియంత్రించిన ఈ వర్గం అపార సంపదను కూడబెట్టింది. అనేక దేశాల్లో ప్రభుత్వ విధానాలపై కూడా ప్రభావం చూపడం ప్రారంభించింది. ఈ దశలో రాజ్యాధికారం కంటే మూలధనాధికారం ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకుంది. 19వ శతాబ్దం చివరి దశ నుంచి 20వ శతాబ్దం వరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ప్రభావం పెరిగింది. భారీ పరిశ్రమలు, బ్యాంకులు, బీమా సంస్థలు, చమురు కంపెనీలు, ఉక్కు పరిశ్రమలు ఆర్థిక శక్తి కేంద్రాలుగా మారాయి. కొందరు పారిశ్రామికవేత్తలు కొన్ని దేశాల ప్రభుత్వాల కంటే ఎక్కువ ఆర్థిక శక్తిని సంపాదించారు. ఈ పరిణామం వల్ల "ధనం ఉన్నవాడు విధానాలను ప్రభావితం చేయగలడు" అనే భావన బలపడింది. 20వ శతాబ్దంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు విస్తరించాయి. వలస పాలన క్షీణించింది. ప్రజలకు ఓటు హక్కులు లభించాయి. చట్టపరంగా అందరూ సమానులయ్యారు. అయినప్పటికీ ఆర్థిక అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. ప్రజాస్వామ్యం రాజకీయ సమానత్వాన్ని తీసుకువచ్చినా ఆర్థిక సమానత్వాన్ని పూర్తిగా తీసుకురాలేకపోయింది. దీంతో సంపద కలిగిన వర్గాలు ఎన్నికలు, మీడియా, పెట్టుబడులు, పరిశ్రమల ద్వారా తమ ప్రభావాన్ని కొనసాగించాయి. 20వ శతాబ్దం చివరలో ప్రపంచీకరణ ప్రారంభమైంది. అంతర్జాతీయ వాణిజ్యం, విదేశీ పెట్టుబడులు, సాంకేతిక విప్లవం, ఇంటర్నెట్ అభివృద్ధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చేశాయి. ఒక దేశంలో స్థాపించబడిన కంపెనీ ప్రపంచవ్యాప్తంగా వ్యాపారం చేసే స్థాయికి ఎదిగింది. అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల వార్షిక ఆదాయాలు కొన్ని దేశాల స్థూల జాతీయోత్పత్తికి సమానంగా మారాయి. ఇది చరిత్రలో ఎన్నడూ లేని పరిణామం. 21వ శతాబ్దంలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కొత్త శక్తి కేంద్రాలను సృష్టించింది. గతంలో భూమి సంపదకు ప్రతీక అయితే నేడు డేటా సంపదకు ప్రతీకగా మారుతోంది. సాంకేతిక సంస్థలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది వినియోగదారుల సమాచారాన్ని నిర్వహిస్తున్నాయి. డిజిటల్ వేదికలు సమాచార ప్రవాహాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రకటనలు ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సంపద కేవలం బ్యాంకు ఖాతాల్లో మాత్రమే కాదు; డేటాలో, సాంకేతికతలో, మేధో సంపత్తిలో కూడా కేంద్రీకృతమవుతోంది. భారతదేశంలో ఆర్థిక సంస్కరణల తర్వాత కార్పొరేట్ రంగం వేగంగా విస్తరించింది. సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమ, మౌలిక వసతుల రంగం, టెలికమ్యూనికేషన్ రంగం దేశ అభివృద్ధికి కొత్త దిశను చూపాయి. లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. కోట్లాది మంది మధ్యతరగతిలోకి ప్రవేశించారు. అయితే మరోవైపు సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందనే చర్చ కూడా ప్రారంభమైంది. అభివృద్ధి ప్రయోజనాలు అందరికీ సమానంగా చేరుతున్నాయా అనే ప్రశ్న మరింత ప్రాధాన్యం పొందింది.

చరిత్రలో ఒక ముఖ్యమైన వాస్తవం ఏమిటంటే సంపద ఎప్పుడూ అధికారాన్ని ప్రభావితం చేసింది. అయితే ప్రతి కాలంలో ఆ ప్రభావం రూపం మారింది. రాజ్యాల కాలంలో అది భూమి రూపంలో కనిపించింది. వాణిజ్య యుగంలో వ్యాపార సంపద రూపంలో కనిపించింది. పారిశ్రామిక యుగంలో కర్మాగారాల రూపంలో కనిపించింది. నేడు అది కార్పొరేట్ పెట్టుబడులు, డిజిటల్ సాంకేతికత, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ రూపంలో కనిపిస్తోంది. అందువల్ల "డబ్బున్న వాడిదే రాజ్యం" అనే సామెత వెనుక ఉన్న చారిత్రక వాస్తవం ఎంతో లోతైనది. అయితే చరిత్ర మరో ముఖ్యమైన పాఠాన్ని కూడా నేర్పుతోంది.



# సమ్మేళనానికి భారీగా తరలిన బీజేపీ శ్రేణులు



**ఈవార్తలు హన్మకొండ:** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ బూత్ విజయ సంకల్ప సమ్మేళనంలో 47వ డివిజన్ అధ్యక్షుడు గంధసిరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ సమావేశంలో బూత్ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడంతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కార్యాచరణ, తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరగనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గంధసిరి శ్రీకాంత్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నితిన్ నబిన్ తెలంగాణకు తొలిసారిగా రావడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ ఉపాధ్యక్షుడు మద్దెల కార్తీక్, బూత్ అధ్యక్షుడు సిరిబాద్రి విష్ణు, జిల్లా నాయకులు చాంద్ పాషా, గడప శివ, కొత్త రవి, ఉడతాల బాబు, సీనియర్ నాయకులు రామగిరి శ్రీనివాస్, తేజ, పుష్ప, విద్యాసాగర్‌తో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు వరం

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ఈవార్తలు తాండూర్:** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. తాండూర్ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పెద్దబోయిన శంకర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, తాండూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, మాజీ ఎంపీపీ మాస వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ సాలిగామ భానయ్య, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ మోమిన్ అలీ, మండల ప్రధాన కార్యదర్శి నవీన్ పటేల్, కార్యదర్శి గాజుల తిరుపతి, పప్పీ, మేడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ ఓ యాప్‌లో ఓటర్ల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఈవార్తలు మంచిర్యాల:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల నుంచి సేకరించిన సమాచారాన్ని బీఎల్ఓ యాప్‌లో స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 21, 15 వార్డుల్లో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను మండల తహశీల్దార్ సతీష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 24 వరకు నిర్వహించే ఇంటింటి సర్వేను పారదర్శకంగా చేపట్టాలని, ఎన్యుమరేషన్ ఫారం అందించిన వెంటనే బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం నింపిన ఫారాలను సేకరించి వివరాలను యాప్‌లో పొందుపర్చాలని పేర్కొన్నారు. మరణించిన ఓటర్లు, గ్రామం విడిచి వెళ్లిన వారు, ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఎపిక్ కార్డులు ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి ఓటరుకు ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండేలా ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తాండూరులో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం

**ఈవార్తలు తాండూర్:** తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం తాండూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ రిక్కల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా ఠాకూర్ ఉమ్రావ్ సింగ్, కార్యదర్శిగా తాటిపాముల సాంబమూర్తి, కోశాధికారిగా గందె రాజన్న, ఉపాధ్యక్షులుగా మద్దికుంట రామచందర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా లయన్ రిక్కల నారాయణరెడ్డి మాట్లాడుతూ తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ గత 11 సంవత్సరాలుగా ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరాలు, మధుమేహ నిర్ధారణ శిబిరాలు నిర్వహించడంతో పాటు దుప్పట్లు, దోమతెరలు తదితర వాటిని పేదలకు పంపిణీ చేస్తూ నిరంతరం సేవలందిస్తోందని కొనియాడారు. నూతన అధ్యక్షుడు ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్‌కు అనుగుణంగా అన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, అవసరమైన వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ కోఆర్డినేటర్ దుద్దిల్ల నారాయణరావు, రీజియన్ చైర్‌పర్సన్ బొమ్మ బాపురెడ్డి, జోనల్ చైర్‌పర్సన్ అన్నం రమేష్, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు దేవరకొండ రాజయ్య, బాలప్రసాద్ మారూ, తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా సంత్ కబీర్ దాస్ జయంతి వేడుకలు



**ఈవార్తలు వాంకిడి:** మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం సంత్ కబీర్ దాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ కబీర్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కు, భక్తి ఉద్యమకారుడు సంత కబీర్ దాస్ కు మధ్య భావజాలపరంగా గురు–శిష్యుల సంబంధం ఉందని అన్నారు. అంబేద్కర్ కబీర్ ను తన ముగ్గురు గురువులు బుద్ధుడు, కబీర్, జ్యోతిరావ్ పూలే ఒకరిగా భావించారని తెలిపారు. సంత్ కబీర్ దాస్ హిందూ, ఇస్లాం మతాల్లో నెలకొన్న మూఢనమ్మకాలు, అస్పృశ్యత, కులవ్యవస్థలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ సమానత్వం, మానవత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. అదే భావజాలాన్ని డాక్టర్ అంబేద్కర్ తన జీవితాంతం ఆచరిస్తూ దళితుల సామాజిక విముక్తి కోసం పోరాడారని పేర్కొన్నారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవత్వం ఇద్దరి బోధనల్లోనూ స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు దుర్గం సునీల్ కుమార్, కార్యదర్శి ప్రతాప్, సమాజ అధ్యక్షులు దుర్గం శ్యామ్‌రావు, రాజేశ్వర్, సభ్యులు సురేందర్, అరుణ్, లడ్డు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# వారసంత రహదారికి గ్రావెల్ వేయాలి

- ఎంపీడీఓకు బీజేపీ నాయకుల వినతి

**ఈవార్తలు వాంకిడి:** మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారసంతకు వెళ్లే సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వేయడంతో పాటు వారసంతలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ యువ నాయకుడు దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ సీసీ రోడ్డు ఇరువైపులా గ్రావెల్ లేకపోవడంతో వారసంతకు వచ్చే ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది వారసంత ద్వారా సుమారు రూ.10లక్షల వరకు ఆదాయం వస్తున్నప్పటికీ, కనీస సౌకర్యాలైన షెడ్లు, మరుగుదొడ్లు, అంతర్గత రహదారులు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై సంబంధిత అధికారులు దృష్టి సారించక పోవడం బాధాకరమని అన్నారు. ఈ సమస్యను గతంలో వాంకిడి మేజర్ గ్రామపంచాయతీ గ్రామసభలో ప్రస్తావించడంతో పాటు పలుమార్లు గ్రామ కార్యదర్శి, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. బుధవారం సాయంత్రంలోపు రహదారి సమస్యను పరిష్కరించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కారం కాకపోతే వారసంతలో దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు కాంట్రాక్టర్‌కు ఎలాంటి రుసుము చెల్లించవద్దని పిలుపునిచ్చారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వేయించి, వారసంతలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్, బీజేపీ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వనేష్, శివ, రాజు, శ్రీరామ్, విశాల్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి





## అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

**ఈవార్తలు మంచిర్యాల:** ప్రభుత్వం విద్యా రంగంలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను సందర్శించి వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు మెనూ ప్రకారం ప్రభుత్వం పోషకాహారాన్ని అందిస్తోందన్నారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యా శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి, విద్యార్థుల చేరికలు పెరిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఈవార్తలు మందమర్రి:** మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సంకె రవి డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కార్మికుల జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత విధానాలనే కొనసాగిస్తూ కార్మికుల కుటుంబ సభ్యులకు పనులు కల్పించకుండానే ఇంటికి పంపిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు అనేక హామీలు ఇచ్చినప్పటికీ, మూడు సంవత్సరాలు గడిచినా వాటిని నెరవేర్చలేదని మండిపడ్డారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతాయని హెచ్చరించారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికల ప్రక్రియలో సీటీయూ అధ్యక్షుడు చెన్నరాజు, జిల్లా కార్యదర్శి దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ప్రధాన కార్యదర్శిగా మేడపట్ల నరసయ్య, ఉపాధ్యక్షులుగా ఎల్కటూరి భూమయ్య, దాసరి శంకరమ్మ, సహాయ కార్యదర్శిగా దుర్గం శంకర్‌తో పాటు 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా మారుపాక పోసు, తదితరులు ఎన్నికయ్యారు.

# అధికారుల కోసం రైతుల నిరీక్షణ

- రైతు వేదికలో ఖాళీ కుర్చీలే దర్శనం
- సమయపాలనపై రైతుల ఆగ్రహం



**ఈవార్తలు వాంకిడి:** మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం అధికారులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమ సమస్యల పరిష్కారం కోసం మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఉదయం నుంచే రైతు వేదిక వద్ద వేచి చూసినా, మధ్యాహ్నం వరకు సంబంధిత అధికారులు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల కథనం ప్రకారం.. అధికారులు నిర్ణీత సమయానికి వస్తారనే ఆశతో వ్యవసాయ పనులను వదిలి రైతు వేదికకు చేరుకున్నామని తెలిపారు. కొందరు అన్నం కూడా తినకుండా, మరికొందరు ఇంటి, పొలం పనులను వాయిదా వేసుకుని వచ్చినప్పటికీ, అక్కడ అధికారులు కనిపించక ఖాళీ కుర్చీలు మాత్రమే దర్శనమిచ్చాయని వాపోయారు. ప్రస్తుతం వర్షాకాల వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో విత్తనాలు విత్తడం, ఎరువుల వినియోగం వంటి పనుల మధ్య సమయం కేటాయించి రైతు వేదికకు వస్తే గంటల తరబడి వేచి ఉండాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. రైతుల సమయానికి విలువ ఇవ్వకపోతే రైతు వేదికల ఏర్పాటు ఉద్దేశమేంటని ప్రశ్నించారు. రైతు వేదికలు వివిధ ప్రభుత్వ శాఖల సేవలను ఒకేచోట రైతులకు అందించేందుకు ఏర్పాటు చేసినప్పటికీ, అధికారులు సమయానికి హాజరుకాకపోతే ఆ లక్ష్యం నెరవేరదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, వాటిని అమలు చేసే అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. ఈ ఘటనపై మీడియా సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించగా, కొందరు "కార్యాలయంలో ఉన్నాం", మరికొందరు "ఇంకో గ్రామానికి వెళ్లాం, వస్తున్నాం" అని భిన్నమైన సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. అయితే అదే సమయంలో రైతు వేదిక వద్ద అధికారులు ఎవరూ లేరని రైతులు పేర్కొనడంతో అధికారుల వివరణలపై సందేహాలు వ్యక్తమయ్యాయి. "ప్రతి వారం ఇదే పరిస్థితి. అధికారులు సమయానికి వస్తే మా పనులు త్వరగా పూర్తవుతాయి. కానీ గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో వ్యవసాయ పనులు కూడా దెబ్బతింటున్నాయి" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు హాజరు కాలేని పరిస్థితుల్లో ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, రైతులను అవస్థలకు గురిచేయడం సరికాదని అంటున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రయాణ ఖర్చులు భరించి రైతు వేదికకు వచ్చినప్పటికీ అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, దీంతో ప్రభుత్వ వ్యవస్థపై రైతుల విశ్వాసం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రైతు వేదికల్లో అధికారుల హాజరును పర్యవేక్షించి, సకాలంలో సేవలు అందేలా చూడాలని కోరారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఈవార్తలు మంచిర్యాల:** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామానికి చెందిన రామటెంకి రాజమల్లు తన తండ్రి ఆధీనంలోని ఇల్లు, పెరడును కొందరు అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ వాసులు గుడిపేటలోని కేంద్రీయ విద్యాలయానికి వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును తమ ప్రాంతం వరకు పొడిగించాలని కోరారు. అలాగే గొర్రె శ్రీనివాస్ తనకు కేటాయించిన భూమి కబ్జాకు గురైనట్లు, బోయిని లచ్చయ్య తన భూమిని అక్రమంగా పట్టా చేయించి బెదిరింపులకు గురిచేస్తున్నారని, బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన కాడం బీరయ్య తమ గ్రామంలో మురుగు కాలువల మంజూరుకు చర్యలు తీసుకోవాలని అర్జీలు సమర్పించారు. సర్వాయిపేట గ్రామానికి చెందిన ఉప్పరి ఆశ్రిత సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో సీటు కల్పించాలని కోరగా, రామకృష్ణాపూర్‌కు చెందిన వెల్దండి మల్లేశ్వరి తన భర్త పేరిట ఉన్న పింఛన్‌ను తన పేరుకు మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 48 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా శ్రీకృష్ణదేవరాయలు



**ఈవార్తలు తాండూర్:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించారు. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన చిలుముల శ్రీకృష్ణదేవరాయలను నియమించారు. శ్రీకృష్ణదేవరాయలు విద్యార్థి దశ నుంచే ఏబీవీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. కళాశాల అధ్యక్షుడు, బెల్లంపల్లి నగర సహాయ కార్యదర్శి, నగర కార్యదర్శి, భాగ్ కోకన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా కోకన్వీనర్, జిల్లా కన్వీనర్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా 2007 నుంచి 2018 వరకు వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే రాష్ట్రీయ హిందూ సేన ప్రతినిధిగా, హిందూ ఉత్సవ సమితి బెల్లంపల్లి కోశాధికారిగా, రామ మందిర నిర్మాణ నిధి ప్రచార ప్రముఖ్‌గా పలు బాధ్యతలు నిర్వహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా క్రియాశీలక పాత్ర పోషించడంతో పాటు తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేశారు. ఇటీవల బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా కూడా సేవలందించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుల సూచనల మేరకు అందరిని కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ నియామకంపై బెల్లంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఈవార్తలు ఆదిలాబాద్:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధిహామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 68 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహశీల్దార్లు, శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను ప్రజావాణి పోర్టల్‌లో సమయానుకూలంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు, డాక్టరేట్ పొందిన కలెక్టరేట్ పరిపాలన అధికారిని జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్. చిత్రు, డీఆర్‌ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ఉక్కుపాదం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

**ఈవార్తలు ఆదిలాబాద్:** జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గత రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మూడు కేసులు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇచ్చోడ మండలం సిరిచెల్మ గ్రామ ఉప సర్పంచ్ అబ్దుల్ అజీమ్ ఆర్మూర్ ఘటనను వక్రీకరిస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వీడియో రూపొందించి వాట్సాప్ స్టేటస్‌లో పోస్టు చేసినందుకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అలాగే ఇస్లాంపూర్‌కు చెందిన యూనుస్ ఇలాంటి వక్రీకృత పోస్టులు ప్రచారం చేసినందుకు అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇంద్రవెల్లి మండలం ధనోరా(కె) గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంకారిగూడకు చెందిన జాడి జస్వంత్ గ్రామ ఘటనను వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టు చేసినందుకు అరెస్ట్ చేసినట్లు వివరించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, విద్వేషపూరిత పోస్టులు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు నిజానిజాలు నిర్ధారించుకోకుండా పోస్టులు షేర్ చేయవద్దని సూచించారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని, తమ గ్రూపుల్లో విద్వేషపూరిత పోస్టులు కనిపిస్తే వెంటనే తొలగించాలని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే అడ్మిన్లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో సోషల్ మీడియాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసులు పేర్కొన్నారు.

# ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రతను పునరుద్ధరించాలి

**కౌటాలలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో**



**ఈవార్తలు కౌటాల:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన భద్రతను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కౌటాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్దతుతో చేపట్టిన ఈ ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌కు భద్రతను తొలగించడం సరైన నిర్ణయం కాదని అన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా ఆయనకు గతంలో ఉన్న భద్రతను యథాతథంగా పునరుద్ధరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో ఆవు మృతి



**ఈవార్తలు తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని శివాజీ నగర్‌లో ఆదివారం రాత్రి పిడుగుపాటుతో ఒక ఆవు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు పెద్దబోయిన భూమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తన ఆవుపై రాత్రి సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందిందని చెప్పారు. మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.40 వేలు వరకు ఉంటుందని తెలిపారు. వ్యవసాయ పనుల ప్రారంభ సమయంలో తన జీవనాధారమైన ఆవు మృతిచెందడం తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని, సంబంధిత శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# భరణిపాడు పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలు



**ఈవార్తలు సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భరణిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో సోమవారం సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించి సహకార సంఘ అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, రైతులతో కలిసి సహకార ప్రతిజ్ఞ చేయించారు. సహకార భావనను పెంపొందించి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు, పాలకవర్గ సభ్యులు, రైతులు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భరణిపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ




**ఈవార్తలు సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భరణిపాడు గ్రామంలో సోమవారం సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు మందపాటి మహేశ్వర రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బీసీ పెద్ద, కీర్తిశేషులు సురటి వెంకటయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు స్థానిక ఎంపీపీఎస్ (ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల) విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు సుజ్ఞాన్ రాజు, ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన బ్యాగులు అందజేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సురటి వెంకటయ్య గారి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అందించిన సహకారం అభినందనీయమని కొనియాడారు. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## వయ్యారి చిత్రం



దిశా పటాని



## రాపో23 షూట్ ప్రారంభం

### మెగాఫోన్ పట్టిన రామ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన 23వ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. =ర్యాపో23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ప్రముఖ నిర్మాత స్రవంతి రవికిశోర్ ఈ కార్యక్రమానికి హాజరై క్లాప్ కొట్టగా, రామ్ తండ్రి మురళీ పోతినేని కెమెరా స్విచ్ ఆన్ చేసి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని రామ్ సోదరుడు కృష్ణ పోతినేని 'రాపో సినిమాటిక్స్' అనే బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు హీరో రామ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండడం విశేషం. సోషల్ మీడియాలో "ది లోన్ వోల్ఫ్ జర్నీ బిగిన్స్" అనే క్యాప్షన్ తో ఈ సినిమాపై ఆసక్తిని పెంచారు. దీన్నిబట్టి ఇదొక యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ సినిమాకు భారీ టెక్నికల్ టీమ్ పనిచేయనుండటం విశేషం. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరు కెమెరా బాధ్యతలు చేపట్టగా, స్టార్ ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్ యాక్షన్ సన్నివేశాలను డిజైన్ చేస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా ఎ.ఎస్. ప్రకాశ్ వ్యవహరించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.



## సాగర తీరాన నేడే లెనిన్ ట్రైలర్ ఈవెంట్

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఇందులో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని జూలై 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో సినిమా ట్రైలర్‌ను రేపు విడుదల చేయనున్నారు. తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు సంబంధించిన వేదికను ప్రకటిస్తూ చిత్ర బృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు విశాఖపట్నంలోని శరత్ థియేటర్‌లో ట్రైలర్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే ఈ ట్రైలర్‌పై అక్కినేని అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ట్రైలర్ ఏ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో అఖిల్ ఊర మాస్ లుక్‌లో కనిపించనున్నాడు. ఈ చిత్రంతో అఖిల్‌కు భారీ విజయం దక్కుతుందని అభిమానులు, సినీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. మరి 'లెనిన్'తో అఖిల్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.



## సింగర్‌గా సూర్య!

కోలీవుడ్ హీరో సూర్య ఇటీవలే కరుప్పు మూవీతో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. ఈ ఏడాది సమ్మర్‌లో థియేటర్లలో రిలీజైన ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ సినిమాకు ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. ఈ మూవీ తర్వాత సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం తాజాగా బయటకొచ్చింది. ఈ చిత్రంలోని ఓ సాంగ్‌ను స్వయంగా సూర్యనే పాడారు. ఈ పాటకు కేవలం డ్యాన్స్ చేయడమే కాదు.. తన గొంతుతోనే అభిమానులను అలరించనున్నారు. కాగా.. ఈ పాటకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా... కెన్ కరుణాస్ లిరిక్స్ అందించారు. ఈ విషయాన్ని జీవీ ప్రకాష్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సూర్య పాడిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలవనుందని తెలిపారు.

## సర్కస్‌లా భాగ్యరాజ్ అంత్యక్రియలు: రాధిక

ప్రియమైన వ్యక్తిని చివరిసారి చూసే క్షణాలు జీవితంలో ఎంతో భావోద్వేగంగా ఉంటాయి. అలాంటి సమయంలో ప్రశాంత వాతావరణం ఉండాల్సిందిపోయి గందరగోళం నెలకొనడం బాధాకరమని ప్రముఖ నటి రాధికా శరత్‌కుమార్ అన్నారు. దర్శకుడు కె. భాగ్యరాజ్ అంత్యక్రియల సందర్భంగా ఎదురైన పరిస్థితులపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భాగ్యరాజ్‌కు నివాళులర్పించేందుకు వచ్చిన వారి రద్దీతో అంత్యక్రియల వాతావరణం మారిపోతోందని రాధిక ఆవేదన వ్యక్తం చేశారు. దుఃఖించాల్సిన ప్రదేశం సర్కస్‌లా మారిందని వ్యాఖ్యానించారు. మనలో ఈ నిర్లక్ష్య ధోరణి ఎప్పుడు వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు బాధను పంచుకునే సమయంలో వారికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు.






## రష్మిక 'మైసా'.. చేతికి రక్తపు మరకలు

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న రవీంద్ర పుల్లే తాజాగా సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. రష్మిక చేతి ముద్రలతో ఉన్న ఓ షర్ట్‌ను ధరించిన ఫొటోను షేర్ చేస్తూ.. "మైసాతో సంతకం చేయించుకున్నా. రక్తపు మరకలు రాబోతున్నాయి" అని వ్యాఖ్యానించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. దర్శకుడి పోస్ట్‌పై రష్మిక కూడా సరదాగా స్పందించారు. "మనం ఈ అందమైన కళలో కొంచెం రక్తం, పసుపు కూడా కలిపి ఉండాల్సింది! తర్వాతిసారి కచ్చితంగా చేద్దాం" అని కామెంట్ చేశారు. నిర్మాణ సంస్థ అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సైతం "మట్టిలో సంతకం.. రక్తంతో జ్ఞాపకం. 'మైసా' షూటింగ్ లో ఉంది.



## ఓజీ2లో పూజా హెగ్డే?

బుట్టబొమ్మ పూజా హెగ్డే బంపర్ ఆఫర్ కొట్టేసినట్టు ఫిలిం నగర్ టాక్. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన ఛాన్స్ కొట్టేసినట్టు వార్తలు వస్తున్నాయి. పవన్, దర్శకుడు సుజిత్ కాంబినేషన్లో వచ్చిన 'ఓజీ' సినిమా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ఓజీ 2' తెరకెక్కబోతోంది. ఈ సినిమాలో పూజా హెగ్డేను తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే పూజ లక్కీ ఛాన్స్ కొట్టేసినట్టే. గతంలోనే పవన్, పూజా హెగ్డే కాంబినేషన్ సెట్ అవ్వాల్సింది కానీ... కానీ, డేట్స్ సమస్య కారణంగా ఆగిపోయింది. హరీశ్ శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్', క్రిష్ జాగర్లమూడి ప్రాజెక్ట్‌లలో మొదట పూజా పేరు వినపడినా వర్కవుట్ అవ్వలేదు. ఒకవేళ ఇప్పుడు 'ఓజీ 2' వార్త నిజమైతే... వరుస ఫెయిల్యూర్స్‌తో సైలెంట్ అయిన పూజా హెగ్డేకు, ఈ మెగా ప్రాజెక్ట్ ఒక స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ లా మారబోతోంది.




## రవితేజ 'ఇరుముడి' కట్టు సాంగ్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. డివోషనల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచి ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు'ను చిత్ర బృందం విడుదల చేసింది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో సాగే ఈ గీతం, విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో విశేషమైన స్పందనను రాబట్టుకుంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈ లిరికల్ వీడియోలో రవితేజ అయ్యప్ప మాలధారణలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. పూర్తి భక్తి పారవశ్యంలో ఆయన వేసిన స్టెప్పులు, హావభావాలు పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ మొదలయ్యే ఈ గీతం, ఆద్యంతం భక్తి రసాన్ని పండిస్తూ శ్రోతలను కట్టిపడేస్తోంది. పాటలోని విజువల్స్, రవితేజ కొత్త లుక్ చూస్తుంటే సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందనే ఆసక్తి రేకెత్తుతోంది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం అద్భుతంగా ఉంది. భక్తి గీతానికి అవసరమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఆయన తన మార్క్ చూపించారు. గాయకుడు అనంతు తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. ఇక, ఈ పాటకు సాహిత్యం అందించడంలో దర్శకుడు శివ నిర్వాణ కూడా భాగం కావడం విశేషం. రచయిత కల్యాణ్ చక్రవర్తితో కలిసి ఆయన ఈ గీతాన్ని రచించారు. దర్శకుడిగానే కాకుండా మంచి సాహిత్యకారుడిగా కూడా శివ నిర్వాణ తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు.



## ఐర్లాండ్ మమ్మల్ని మించిపోయింది: అయ్యర్

ఐర్లాండ్ చేతిలో టీ20 సిరీస్‌ను కోల్పోయిన తర్వాత భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పిచ్‌ను అర్థం చేసుకోవడంలో, పరిస్థితులకు తగ్గట్టుగా ఆడటంలో ప్రత్యర్థి జట్టు తమకంటే మెరుగ్గా వ్యవహరించిందని అంగీకరించాడు. ఐర్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో ఒక పరుగు తేడాతో ఓడిన భారత్.. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0తో చేజార్చుకుంది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్.. ప్రత్యర్థి ఆటతీరును ప్రశంసిస్తూ తమ జట్టు లోపాలను ప్రస్తావించాడు. "పిచ్ ఎలా ప్రవర్తిస్తుందో మేం సరిగా అంచనా వేయలేకపోయాం. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడటంలోనూ వెనుకబడ్డాం. సింగిల్స్‌ను డబుల్స్‌గా మార్చడంలో కూడా తేడా కనిపించింది. ఆ విషయంలో ఐర్లాండ్ మమ్మల్ని పూర్తిగా మించిపోయింది" అని అయ్యర్ చెప్పాడు. ఈ సిరీస్ తమకు నిరాశ కలిగించిందని, అయితే ఐర్లాండ్ చాలా ప్రొఫెషనల్‌గా ఆడిందని అయ్యర్ కొనియాడాడు. పిచ్‌పై వారికి స్పష్టమైన అవగాహన ఉందని, వారి ఫీల్డింగ్, బౌలింగ్ అత్యున్నత స్థాయిలో ఉన్నాయని ప్రశంసించాడు.

## గ్రౌండ్‌లో ప్లేయర్.. శిథిలాల్లో కుటుంబం

శతాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా వెనిజులాను వణికించిన వరుస భూకంపాలు భారీ విషాదాన్ని మిగిల్చాయి. ఐదురోజులవుతున్నా ఇంకా శిథిలాల కింది నుంచి మృతదేహాలు బయటికొస్తూనే ఉన్నాయి. ఇప్పటికీ అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రకృతి విపత్తు[illegible]అర్జెంటీనాకు చెందిన ప్రముఖ ఫుట్ బాల్ క్రీడాకారుడు లూకాస్ ట్రెజో (38) తన భార్య, ఇద్దరు పిల్లల్ని కోల్పోయారు. వెనిజులా సెకండ్ డివిజన్ టీమ్ క్లబ్ స్పోర్ట్ మారిటిమో లా గుయైరా కు ప్రాతినిధ్యం వహిస్తోన్న ట్రెజో ఫ్యామిలీ భూంకం ధాటికి కూలిపోయిన భవన శిథిలాల కింద చిక్కుకుని మరణించింది. మూడు రోజుల అన్వేషణ తర్వాత వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. భూకంపం సమయంలో ట్రెజో కరాకస్ లోని టీమ్ కోచింగ్ సెంటర్లో ఉన్నారు. విషయం తెలియగానే 18 మైళ్ల దూరంలో ఉన్న లా గుయైరాలోని తన ఇంటికి పరుగున వచ్చారు. అప్పటికే సముద్రతీరంలో ఉన్న వారి ఇల్లు పూర్తిగా నేలమట్టమై, శిథిలాల కుప్పగా మారింది. తన భార్య యానినా, పిల్లలు ఆరోన్, ఐన్హోవా బ్రతికే ఉంటారన్న ఆశతో మూడురోజులపాటు చేతులతోనే శిథిలాలను తొలగిస్తూ అన్వేషించారు. భారీ యంత్రాలతో శిథిలాలను తొలగించేందుకు సోషల్ మీడియా ద్వారా తన ఫ్రెండ్స్, తోటి ఆటగాళ్ల సహాయంతో వేడుకున్నారు. ఆదివారం నాటికి వారి మృతదేహాలు దొరకడంతో.. లూకాస్ బాధకు అంతులేకుండా పోయింది. ఈ విషాదంపై క్లబ్ స్పోర్ట్ మారిటిమో లా గుయైరా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. "లూకాస్, నువ్వు ఒంటరివి కావు.. ఈ కష్టసమయంలో నీ జట్టు నీకు అండగా ఉంటుంది" అని పేర్కొంది.


## ఐపీఎల్ బ్యాటింగ్ పిచ్ వల్లే టీమిండియా ఓటమి: అశ్విన్

భారత క్రికెట్‌లో నిన్న ఒక చీకటి అధ్యాయం లిఖించబడింది. పసికూనగా భావించే ఐర్లాండ్ చేతిలో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 0–2 తేడాతో క్లీన్‌స్వీప్‌కు గురైంది. మూడుసార్లు టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత్, బెల్‌ఫాస్ట్‌లో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ ఐరిష్ జట్టు ముందు తేలిపోయింది. ఈ పరాభవం ఇంగ్లండ్‌తో జరగబోయే కీలక సిరీస్‌కు ముందు జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది.



శుక్రవారం జరిగిన తొలి టీ20లో 183 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ 34 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఇక నిన్న జరిగిన రెండో మ్యాచ్‌లో 155 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. రెండు మ్యాచ్‌లలోనూ భారత బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోవడం గమనార్హం. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి స్టార్ హిట్టర్లు కూడా పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. తొలి మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 20 బంతుల్లో 49 పరుగులు చేసి మెరిసినా, రెండో మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరగడం బ్యాటింగ్ వైఫల్యానికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఓటమికి గల కారణాలపై మాజీ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఆసక్తికర విశ్లేషణ చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించే ఫ్లాట్ పిచ్‌లపై ఆడటం వల్లే భారత ఆటగాళ్లు విదేశీ గడ్డపై ఇబ్బంది పడుతున్నారని అభిప్రాయపడ్డాడు. "ఐపీఎల్‌లో మనం చూసే 24 క్యారెట్ల నాణ్యమైన బ్యాటింగ్ పిచ్‌లు ఇక్కడ అందుబాటులో లేవు. అందుకే ఇక్కడ జరిగిన నాణ్యమైన క్రికెట్‌ను నేను ఎంతో ఆస్వాదించాను. భారత బ్యాటింగ్ లైనప్‌లోని చాలా మంది ఆటగాళ్లు ఐపీఎల్ నుంచే నేరుగా వచ్చారు.





# అర్జెంటీనాకు ఈజీనే!



**ఫైనల్ చేరడం నల్లేరుపై నడకే?.. సెమీస్ వరకు బలహీన ప్రత్యర్థులే**

ఫిఫా ప్రపంచకప్ 2026లో అసలైన సమరానికి తెరలేచింది. ఉత్కంఠభరితంగా, నాటకీయ పరిణామాల మధ్య సాగిన గ్రూప్ స్టేజ్ శనివారంతో ముగియడంతో టాప్ 32 జట్లు నాకౌట్ పోరుకు సిద్ధమయ్యాయి. అయితే, విడుదలైన నాకౌట్ షెడ్యూల్ బ్రాకెట్ ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**ఒకవైపు డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాకు ఫైనల్ వరకు మార్గం సుగమంగా కనిపిస్తుండగా, మరోవైపు యూరప్‌కు చెందిన అగ్రశ్రేణి జట్లన్నీ ఒకేచోట చేరి కఠినమైన సవాల్‌ను ఎదుర్కోబోతున్నాయి. గ్రూప్ స్టేజ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ గెలిచి అగ్రస్థానంలో నిలిచింది.**

కెప్టెన్ లియోనల్ మెస్సీ ప్రతి మ్యాచ్‌లో సగటున రెండు గోల్స్ చొప్పున సాధించి అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అర్జెంటీనాతో పాటు 2018 విజేత ఫ్రాన్స్, ఆతిథ్య దేశాల్లో ఒకటైన మెక్సికో మాత్రమే గ్రూప్ దశలో వంద శాతం విజయాలు నమోదు చేశాయి. ఫ్రాన్స్ తరఫున కిలియన్ ఎంబాపె, ఉస్మాన్ డెంబెలె గోల్స్‌తో రాణించారు. మరోవైపు, 2014 ఛాంపియన్ జర్మనీ తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఈక్వెడార్ చేతిలో ఓడిపోవడం నిరాశపరిచింది. టోర్నీని 7–1 భారీ విజయంతో ఆరంభించినప్పటికీ ఈ ఓటమి ఆ జట్టును దెబ్బతీసింది. బ్రెజిల్, పోర్చుగల్, ఇంగ్లండ్, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ వంటి జట్లు కూడా గ్రూప్ స్టేజ్ ప్రదర్శన పట్ల పూర్తి సంతృప్తితో లేవు. నాకౌట్ డ్రాను విశ్లేషిస్తే.. లియోనల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనాకు ఫైనల్ చేరేందుకు మార్గం చాలా సులువుగా కనిపిస్తోంది. రౌండ్ ఆఫ్ 32లో అర్జెంటీనా.. కేప్ వెర్డెతో తలపడనుంది. ఈ టోర్నీలో కేప్ వెర్డె కొన్ని సంచలనాలు సృష్టించినప్పటికీ, అర్జెంటీనాను ఓడించడం వారికి అతిపెద్ద సవాల్. ఈ మ్యాచ్‌లో గెలిస్తే, రౌండ్ ఆఫ్ 16లో ఈజిప్ట్–ఆస్ట్రేలియా మ్యాచ్ విజేతతో అర్జెంటీనా ఆడుతుంది. ఈ రెండు జట్లు కూడా గ్రూప్ స్టేజ్‌లో సాధారణ ప్రదర్శనతోనే నాకౌట్‌కు చేరాయి. ఇక క్వార్టర్ ఫైనల్స్‌లో అర్జెంటీనాకు స్విట్జర్లాండ్, కొలంబియా, ఘనా, లేదా అల్జీరియాలో ఒక జట్టు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ నాలుగు జట్లతో పోలిస్తే అర్జెంటీనా స్పష్టమైన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుంది. అంటే, సెమీ ఫైనల్స్ వరకు అర్జెంటీనాకు పెద్దగా గట్టి పోటీ ఎదురయ్యే సూచనలు కనిపించడం లేదు. సెమీస్‌లో బ్రెజిల్, నార్వే, ఐవరీ కోస్ట్, లేదా ఇంగ్లండ్ వంటి జట్లతో తలపడే అవకాశం ఉంది. అర్జెంటీనా ప్రయాణం ఒక ఎత్తు అయితే, షెడ్యూల్ బ్రాకెట్‌లో మరోవైపు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఫ్రాన్స్, పోర్చుగల్, జర్మనీ, నెదర్లాండ్స్, స్పెయిన్, బెల్జియం వంటి యూరోపియన్ దిగ్గజాలన్నీ ఒకే వైపు చేరాయి. దీంతో నాకౌట్ దశలో హోరాహోరీ పోరు ఖాయమైంది. రౌండ్ ఆఫ్ 16లో మాజీ ఛాంపియన్లు జర్మనీ, ఫ్రాన్స్ అమీతుమీ తేల్చుకోనే అవకాశాలున్నాయి. అంటే ఈ మ్యాచ్‌తో ఒక టాప్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయం. అదేవిధంగా, మరో రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో స్పెయిన్, పోర్చుగల్ తలపడేలా షెడ్యూల్ ఉంది. దీంతో ఈ రెండు జట్లలో కూడా ఒకటి ఇంటిముఖం పట్టక తప్పదు. ఈ నేపథ్యంలో అర్జెంటీనా సెమీస్ వరకు పెద్దగా శ్రమించకుండానే చేరే అవకాశం ఉండగా, యూరోపియన్ జట్లు మాత్రం ఫైనల్ చేరాలంటే ప్రతి మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటను ప్రదర్శించాల్సి ఉంటుంది. నాకౌట్ తొలి దశ నుంచే ఫైనల్‌ను తలపించే మ్యాచ్‌లు జరగనుండటంతో ఈ ప్రపంచకప్‌పై అభిమానుల్లో అంచనాలు తారాస్థాయికి చేరాయి.



## ఒలింపిక్స్‌కు భారత మహిళల క్రికెట్ జట్టు అర్హత

2028లో జరిగే లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి రాబోతోంది. 128 ఏళ్ల తర్వాత విశ్వక్రీడల్లో క్రికెట్‌ను చూడబోతున్నాం. టీ20 ఫార్మాట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఈవెంట్స్ జరగనున్నాయి. క్రికెట్ ఈవెంట్స్‌కు సంబంధించిన అర్హత ప్రమాణాలను ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) సోమవారం ప్రకటించింది. ఐసీసీ సిఫార్స్ చేసిన ప్రతిపాదనలకు ఐవోసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం తెలిపింది. పురుషుల, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లు పాల్గొంటాయి. అందులో ఒక్క బెర్త్ ఆతిథ్య దేశమైన అమెరికాకు కేటాయించారు. ఓషియానియా, యూరోప్, ఆసియా, అఫ్రికా ఖండాలకు నాలుగు బెర్త్‌లు ఉన్నాయి. మరో బెర్త్‌ను క్వాలిఫయర్ ద్వారా ఎంపిక చేస్తారు. టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు గ్రూపు దశలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఆదివారం కీలక పోరులో ఆస్ట్రేలియా చేతిలో ఓడటం సెమీస్ ఆశలు గల్లంతయ్యాయి. అయితే, ఈ టోర్నీలో పాల్గొనడం ద్వారా భారత జట్టు ఒలింపిక్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ప్రపంచకప్ ర్యాంక్‌ల ఆధారంగా భారత్‌తోపాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు కూడా అర్హత సాధించాయి. ఓషియానియా నుంచి ఆస్ట్రేలియా, ఆసియా నుంచి భారత్, యూరోప్ నుంచి ఇంగ్లాండ్, ఆఫ్రికా నుంచి సౌతాఫ్రికా టీమ్‌లు టాప్ ర్యాంక్‌లో ఉండటంతో తమ స్థానాలను ఖాయం చేసుకున్నాయి. టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ సెమీస్‌కు చేరుకున్నప్పటికీ ఆ జట్టుకు బెర్త్ దక్కలేదు. కరేబియన్ జట్టు అనేది 13 దేశాల సమూహం.

## వింబుల్డన్‌లో నిరసనపై తగ్గిన స్టార్ ఆటగాళ్లు

**నిర్వాహకులతో చర్చల తర్వాత ఆటగాళ్ల కీలక నిర్ణయం**

ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టోర్నమెంట్ ప్రారంభానికి ముందు నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. మీడియా సమావేశాలను పరిమితం చేయాలన్న తమ నిరసనను తాత్కాలికంగా విరమించుకుంటున్నట్టు అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాళ్లు ప్రకటించారు. నిర్వాహకులతో జరిపిన చర్చలు ఫలించడంతో, టోర్నమెంట్ మీడియా కార్యకలాపాలు యథాతథంగా కొనసాగనున్నాయి. గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ల ద్వారా వచ్చే ఆదాయంలో అధిక వాటా, ఆటగాళ్ల సంక్షేమానికి మరిన్ని నిధులు, టోర్నీల పాలనలో కమిటీ ఏర్పాటు వంటి డిమాండ్లతో 2025 నుంచి ఆటగాళ్లు పోరాటం చేస్తున్నారు. ఇందులో భాగంగానే వింబుల్డన్ తొలి వారంలో మీడియా సమావేశాలను కేవలం 15 నిమిషాలకే పరిమితం చేయాలని మొదట నిర్ణయించారు. అయితే, ఆల్ ఇంగ్లండ్ క్లబ్ ప్రతినిధులతో వారాంతంలో జరిగిన చర్చల అనంతరం ఆటగాళ్లు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ది గార్డియన్ కథనం ప్రకారం, ఆటగాళ్లు ఈ విషయంపై ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. "వారాంతంలో జరిగిన ఫలవంతమైన చర్చల నేపథ్యంలో, సోమవారం (జూన్ 29) నుంచి సాధారణ మీడియా కార్యకలాపాలలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం. మా డిమాండ్లపై నిర్దిష్ట ప్రతిపాదనలతో తిరిగి వస్తామని వింబుల్డన్ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ఆటగాళ్లు తమ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, అసలు సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, నిర్వాహకుల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ఆటగాళ్ల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని, ప్రైజ్ మనీ నమూనా, పాలనలో ప్రాతినిధ్యం వంటి అంశాలపై పక్కా ప్రణాళికలు రూపొందించడానికి ఆల్ ఇంగ్లండ్ క్లబ్ అంగీకరించింది. ప్రస్తుతానికి ఈ వివాదం సద్దుమణిగినప్పటికీ, ఇరు పక్షాల మధ్య చర్చలు కొనసాగనున్నాయి. కాగా, గ్రాస్ కోర్టుపై జరిగే వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ నేడు (జూన్ 29) లండన్ లో ప్రారంభమైంది.



# సంపాదకీయం

నేటి ఈవార్తలు

Editorial

## విలువలే పత్రికకు ప్రాణం

నేటి సమాచార విస్ఫోటన యుగంలో వార్తల కంటే వేగంగా పుకార్లు వ్యాపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో నిజం కంటే అబద్ధం ముందుకు పరిగెడుతోంది. సంచలనానికి ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో వాస్తవాలకు కట్టుబడి ఉండటం మరింత సవాలుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో విలువలతో కూడిన జర్నలిజం అవసరం ఎన్నడూ లేనంతగా పెరిగింది. పత్రిక ధర్మం అధికారాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సమాజ ప్రయోజనాల కోసం నిర్భయంగా నిలబడటం. ఏ రాజకీయ పార్టీకి, ఏ వ్యాపార సంస్థకు లేదా ఏ వ్యక్తిగత ప్రయోజనానికి వేదికగా మారకుండా ప్రజా ప్రయోజనాలనే పరమావధిగా భావించడమే నిజమైన జర్నలిజం. వార్త అనేది అభిప్రాయం కాదు; వాస్తవం. సంపాదకీయం అభిప్రాయం కావచ్చు కానీ అది కూడా నిజాల ఆధారంగానే ఉండాలి.

ఇదే పత్రిక విశ్వసనీయతకు మూలం. విలువలతో కూడిన జర్నలిజం అంటే కేవలం తప్పులను ఎత్తిచూపడం మాత్రమే కాదు. సమాజంలో జరుగుతున్న మంచి పనులను ప్రోత్సహించడం, మార్పుకు మార్గం చూపించడం, ప్రజల్లో చైతన్యం కలిగించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ఒక మంచి కథనం ఒక గ్రామాన్ని మార్చగలదు. ఒక పరిశోధనాత్మక కథనం అవినీతిని వెలికితీయగలదు. ఒక సంపాదకీయం ప్రభుత్వ విధానాల్లో మార్పుకు కారణం కావచ్చు. అంతటి శక్తి పత్రికకు ఉంది. వార్తల ఎంపికలో నిష్పాక్షికత, ప్రచురణలో బాధ్యత, భాషలో సంయమనం, విశ్లేషణలో సమతుల్యత, విమర్శలో నిర్మాణాత్మక దృక్పథం – ఇవన్నీ పత్రిక విలువలకు ప్రతీకలు. ఎవరి మనోభావాలను అనవసరంగా దెబ్బతీయకుండా, అదే సమయంలో ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా ముందుకు సాగడం జర్నలిజం గొప్పతనం. డిజిటల్ యుగం మీడియాకు అపార అవకాశాలను తెచ్చిపెట్టింది. అయితే అదే సమయంలో తప్పుడు సమాచారం, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన నకిలీ కంటెంట్, క్లిక్‌బైట్ శీర్షికలు, చెల్లింపు వార్తలు వంటి సవాళ్లను కూడా తీసుకొచ్చింది.

ఈ పరిస్థితుల్లో ఒక పత్రిక తన విశ్వసనీయతను కాపాడుకోవాలంటే ప్రతి వార్తను నిర్ధారించుకోవడం, ప్రతి సమాచారాన్ని ధ్రువీకరించడం, ప్రతి ప్రచురణలో నైతిక ప్రమాణాలను పాటించడం అత్యంత అవసరం. పత్రిక విజయానికి పాఠకుడే అసలైన యజమాని. పాఠకుడి నమ్మకాన్ని గెలుచుకోవడం కష్టమైన పని; కోల్పోవడం మాత్రం క్షణాల్లో జరిగిపోతుంది. అందుకే పత్రిక ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకుంటూ, తన తప్పులను సరిదిద్దుకుంటూ, మరింత బాధ్యతాయుతంగా ముందుకు సాగాలి. తప్పు జరిగితే అంగీకరించే నిజాయితీ కూడా జర్నలిజం విలువల్లో భాగమే. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుత మీడియా ఎంత అవసరమో, బాధ్యతాయుత మీడియా అంతకంటే అవసరం. స్వేచ్ఛ అంటే నిర్బంధాలు లేకపోవడం మాత్రమే కాదు; ఆ స్వేచ్ఛను ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించడం కూడా. అందుకే ప్రతి వార్త వెనుక ఒక బాధ్యత, ప్రతి శీర్షిక వెనుక ఒక ఆలోచన, ప్రతి సంపాదకీయం వెనుక ఒక సామాజిక నిబద్ధత ఉండాలి.

నిజాన్ని నిర్భయంగా చెప్తున్నాం..
పాఠకుడి ఆసక్తులను అందిస్తున్నాం..
శ్రేయోభిలాషి సూచనలు పాటిస్తున్నాం..
ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తున్నాం..
ప్రజల గొంతును చాటుతున్నాం..
ఒక సంవత్సర కాలంలోనే..
తెలుగు ప్రజల ఆదరాభిమానాలు పొంది,
రెండో వసంతంలోకి
దిగ్విజయంగా అడుగుపెడుతున్నాం..



**ప్రియమైన పాఠకులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటనదారులకు, మా కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక నమస్కారాలు.**

నేటి 'ఈవార్తలు' దినపత్రిక ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మీ అందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సందర్భం ఆనందకరమైనది, బాధ్యతాయుతమైనది. ఈ రోజు మేం జరుపుకుంటున్నది ఒక పత్రిక పుట్టినరోజు మాత్రమే కాదు.. ప్రజల విశ్వాసంతో నిర్మితమైన ఒక విలువల ప్రయాణానికి మొదటి మైలురాయి. ఒక వార్తాపత్రిక విజయాన్ని దాని ప్రచురణల సంఖ్య నిర్ణయించదు. ప్రజల గుండెల్లో సంపాదించుకున్న నమ్మకమే నిర్ణయిస్తుంది. ఆ నమ్మకాన్ని మీరు మాపై ఉంచారు. అదే మాకు అతిపెద్ద బహుమతి. ఈ ఏడాది కాలంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. పోటీ పెరిగింది. అయినా, జర్నలిజం విలువల్లో ఎక్కడా రాజీ పడలేదు.

వార్త అనేది ఎవరి ప్రచారం కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో కాదు.. సమాజానికి నిజాన్ని అందించడం కోసమే. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా మా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాం. అధికారాన్ని ప్రశ్నిస్తూ, బాధితుడి గొంతుకను వినిపిస్తూ, ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్తూ సాగుతున్నాం. ఈ సిద్ధాంతాలనే మా సంపాదకీయ విధానానికి మూలస్తంభాలుగా తీసుకున్నాం.

సంచలనాల కోసం అసత్యాలను ప్రచారం చేయలేదు.
క్లిక్‌బైట్ శీర్షికల కోసం వాస్తవాలను వక్రీకరించలేదు.
వదంతులను వార్తలుగా మార్చలేదు.
సోషల్ మీడియా పోటీలో నిజాయితీని తాకట్టు పెట్టలేదు.
మా వద్ద ప్రతి వార్త ఒక బాధ్యత.
ప్రతి అక్షరం ఒక నిబద్ధత.
ప్రతి శీర్షిక ఒక సామాజిక బాధ్యత.




## మీ విశ్వాసమే మా బలం

మా లక్ష్యం వార్తలు అందించడం మాత్రమే కాదు. ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడం; సమస్యలపై చర్చకు వేదిక కల్పించడం; ప్రజల ఆలోచనలను విస్తరించే విశ్లేషణలను అందించడం; సమాజానికి దిశానిర్దేశం చేసే సంపాదకీయాలను ప్రచురించడం; యువతలో చైతన్యం కలిగించే కథనాలను అందించడం. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంత ముఖ్యమో మాకు బాగా తెలుసు. అందుకే ప్రతి కథనంలో సమతుల్యతను పాటించడానికి ప్రయత్నించాం, ప్రయత్నిస్తున్నాం. అన్ని వర్గాల అభిప్రాయాలను గౌరవించాం, గౌరవిస్తున్నాం. ఆధారాలతో కూడిన సమాచారాన్నే ప్రచురించాం. వార్త వెనుక ఉన్న వాస్తవాన్ని తెలుసుకునేందుకు మా బృందం నిరంతర కృషి చేసింది. గ్రామీణ ప్రాంతాల సమస్యల నుంచి జాతీయ అంశాల వరకు, రైతుల కష్టాల నుంచి యువత అవకాశాల వరకు, మహిళల భద్రత నుంచి విద్య, వైద్యం, ఉపాధి వరకు ప్రతి అంశాన్నీ ప్రజల కోణంలో చూసే ప్రయత్నం చేశాం, చేస్తున్నాం. ఎందుకంటే మా పత్రికకు కేంద్రబిందువు రాజకీయాలు కాదు.. ప్రజలు. మా సంపాదకీయాల ద్వారా ప్రజలకు ఆలోచన కలిగించాలనుకున్నాం. సమస్యలను మాత్రమే చూపించడం కాదు.. పరిష్కార మార్గాలను కూడా సూచించాలనుకున్నాం. విమర్శించడం మాత్రమే కాదు.. నిర్మాణాత్మక సూచనలు చేయాలనుకున్నాం. అదే బాధ్యతాయుత జర్నలిజం అని మేం విశ్వసిస్తున్నాం. ఈ ప్రయాణంలో ఎన్నో మంది మాకు అండగా నిలిచారు. మా విలేకరులు, ఫొటోగ్రాఫర్లు, డెస్క్ జర్నలిస్టులు, డిజైనర్లు, సాంకేతిక బృందం, ప్రకటనదారులు, పంపిణీదారులు, ప్రతి ఉద్యోగి తమ శ్రమను ఈ పత్రిక ఎదుగుదలకు అంకితం చేశారు. వారి కృషి లేకుండా ఈ విజయాన్ని ఊహించడం అసాధ్యం. అలాగే మా పత్రికపై విశ్వాసం ఉంచి ప్రకటనలు ఇచ్చిన వ్యాపారవేత్తలకు, సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు. మీ సహకారం కేవలం వ్యాపార సంబంధం కాదు.. విలువలతో కూడిన జర్నలిజాన్ని ప్రోత్సహించిన సామాజిక బాధ్యత.

ముఖ్యంగా మా పాఠకులందరికీ నా ప్రత్యేక నమస్కారం. ప్రతి ఉదయం మా పత్రికను చేతిలోకి తీసుకుని, ఫోన్‌లో చదివిన ప్రతి ఒక్కరికీ, మా వార్తలను చర్చించిన ప్రతి ఒక్కరికీ, లోపాలను సూచించి మమ్మల్ని మరింత మెరుగుపరిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ ప్రేమ, మీ విమర్శలు, మీ సూచనలు మమ్మల్ని మరింత బాధ్యతాయుతంగా తీర్చిదిద్దాయి. ముందున్న రోజులు మరింత సవాళ్లతో కూడుకున్నవే. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతోంది. సమాచార ప్రపంచం మరింత విస్తరిస్తోంది. ఈ మార్పులకు అనుగుణంగా మేం కూడా ఆధునిక సాంకేతికతను స్వీకరిస్తాం. నిజాయతీ, నిష్పాక్షికత, విశ్వసనీయత.. మూడు సూత్రాలే మార్గదర్శకాలుగా ముందుకు సాగుతాం. భవిష్యత్తులో మరింత లోతైన విశ్లేషణలు, మరింత నాణ్యమైన కథనాలు, మరింత ప్రజోపయోగ సమాచారంతో మీ ముందుకు రావాలని సంకల్పిస్తున్నాం. సమాజంలో మంచి మార్పుకు మీడియా ఒక శక్తిగా నిలవాలంటే ప్రజల విశ్వాసం అవసరం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

ఈ సందర్భంగా ఒక మాట చెప్పాలనుకుంటున్నాను. వార్తాపత్రికను ముద్రించేది యంత్రాలు కావచ్చు. కానీ దానికి ప్రాణం పోసేది ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని మీరు మాకు అందించారు. దానిని కాపాడుకోవడం మా ధర్మం. మా ప్రయాణం ఇక్కడితో ముగియదు. ఇది ఆరంభం మాత్రమే. ఇంకా ఎన్నో మైలురాళ్లు అధిరోహించాలి. ప్రజల పక్షాన నిలబడే జర్నలిజాన్ని మరింత బలోపేతం చేయాలి. సమాజ హితం కోసం కలం మరింత పదునుగా ఉండాలి. ప్రజల గొంతుకగా, నిజానికి ప్రతినిధిగా, విలువలకు వేదికగా, ప్రజాస్వామ్యానికి అండగా.. నేటి 'ఈవార్తలు' తన ప్రయాణాన్ని మరింత నిబద్ధతతో కొనసాగిస్తుందని మీ అందరికీ హామీ ఇస్తున్నా.



మరోసారి మా పాఠకులు, శ్రేయోభిలాషులు, ప్రకటనదారులు,
ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక సంస్థలు,
మా బృంద సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.
మీ ఆశీర్వాదం, మీ ఆదరణ, మీ విశ్వాసం
ఎల్లప్పుడూ మాతో ఉండాలని కోరుకుంటూ..
జైహింద్!

**- బొమ్మకంటి శ్రావణ్ కుమార్, ఎడిటర్**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.